



అభివృద్ధి జరగాలి : కాకినాడ కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

ఆనందం.. కనిపించను!



రెండో రోజుకే 99.06 శాతం పంపిణీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అనుకుంటే సాధ్యం కానిది ఏదీ లేదని నిరూపించారు.. వలంటీర్లు లేరు.. పింఛన్ల పంపిణీపై సరైన అవగాహనలేదు.. అయినా లక్ష్యంపై నూరేశారు. జిల్లాలో కేవలం రెండు రోజుల్లో 99.06 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. అందుబాటులో లేనివారు, ఇతర రాష్ట్రాలకు వెళ్లిన వారుతప్ప మిగతా వారందరికీ పింఛన్లు అందినట్టే. ఎక్కడెక్కడో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి సమాచారం తెలుసుకుని అక్కడకు వెళ్లి పింఛన్లు అందజేశారు. సచివాలయ ఉద్యోగులు ఎక్కడా వెనుకడుగు వేయలేదు. నూరుశాతం పూర్తి చేశారు.. శెహబాస్ అనిపించుకుంటున్నారు. జిల్లాలో మొదటిరోజు 96.31 శాతం పింఛన్లు పంపిణీ చేయగా..రెండోరోజు మంగళవారం మొత్తం 99.06 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి మంగళవారం తెలిపారు. వైసీపీ హయాంలో జిల్లాలో 9148మంది వలంటీర్లు ప్రతీ నెలా 1నుంచి 5వతేదీ వరకూ పెన్షన్లు పంచేవారు. ఇవాళ కేవలం 4092మంది సచివాలయ, ఇతర ఉద్యోగులు కలసి మొదటి ఒక్కరోజే 96శాతం పూర్తి చేగా, రెండోరోజు మంగళవారం నాటికి 99.06శాతానికి పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 241771 మంది లబ్ధిదార్లు ఉండగా, 23948మందికి పంపిణీ చేశారు. కేవలం 2284మంది మిగిలారు. వీరిలో చాలా మంది ఇతర ప్రాంతాలలో ఉన్నవారు ఉంటారు. వృద్ధులు చనిపోయిన వారు కూడా ఉండవచ్చు. ఇక మొత్తం జిల్లాలో రూ.163,36,12,500 పంపిణీ లక్ష్యం కాగా, రూ.161,81,12,500 పంపిణీ చేశారు. ఇక కేవలం రూ. కోటి 55 లక్షలు మిగిలింది.

మండలాల వారీగా ఇలా..

మండలం	పింఛన్‌దారులు	పంపిణీ
అనపర్తి	10,439	10,322
బిక్కవోలు	10786	10,686
రంగంపేట	9035	8,935
దేవరపల్లి	11,171	11,068
గోపాలపురం	9238	9,170
నల్లజర్ల	11,649	11,561
గోకవరం	10,701	10,612
చాగల్లు	9503	9,436
కొవ్వూరు	10,257	10,199
కొవ్వూరు(మున్సిపాల్టీ)	4015	3,982
తాళ్లపూడి	7941	7,868
నిడదవోలు	10,551	10,465
నిడదవోలు(మున్సిపాల్టీ)	4334	4,301
పెరవలి	10,420	10,319
ఉండ్రాజవరం	10,512	10,413
కడియం	12,144	11,997
కోరుకొండ	12,474	12,368
రాజానగరం	15,564	15,422
సీతానగరం	11,739	11,633
రాజమండ్రి (అర్బన్)	29,436	29,126
రాజమండ్రి(రూరల్)	19,862	19,604



నిడదవోలు : నిడదవోలు పట్టణానికి చెందిన ర్యాలి నాగేశ్వరరావు అనారోగ్యంతో విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలియడంతో మంగళవారం నిడదవోలు వీక్లీ మార్కెట్ సచివాలయ ఉద్యోగి ఎస్.సుబ్బారావు విజయవాడ ఆసుపత్రికి వెళ్లి పెన్షన్ అందజేశారు.

ఆసుపత్రిలో ఉన్నా ఆపలేదు..



చాగల్లు : రాజమహేంద్రవరం జీఎస్ఎల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వాకా నరసింహ మూర్తి, రాజారత్నం, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బెల్లాపు సావిత్రిలకు సచివాలయ ఉద్యోగులు వారి వద్దకు వెళ్లి పింఛన్లు అందజేశారు. సోమవారం పింఛను పంపిణీకి వెళితే సమాచారం అందడంతో మంగళవారం ఉదయమే వారి వద్దకు వెళ్లి పింఛను అందజేశారు. ఈ మేరకు వారు అభినందనలు తెలిపారు.

పవన్..పవర్

4 గంటల పాటు ఏకధాటిగా సాగిన సమీక్షలు

- అన్ని వ్యవస్థలను గాడిలో పెడతాం
- ఐదేళ్లలో రూ.5 వేల కోట్ల ఇసుక రాబడి
- స్థానిక సంస్థలకు సీనరేజీ ఎగవేత
- పంచాయతీ నిధులు మింగేసిన జగన్
- జలజీవన్ మిషన్ నిధులతో గ్రామాలకు నీళ్లు
- హోప్ ఐలాండ్ ఎకో టూరిజం పార్కుగా అభివృద్ధి
- ఉప్పాడ సముద్ర కోత పరిశీలనకు నేడు నిపుణులు
- కాకినాడ జిల్లాలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

కాకినాడ (కలెక్టరేట్), జూలై 2: కేంద్రం ఇస్తున్న జలజీవన్ మిషన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకుని అన్ని గ్రామాలకు రక్షిత తాగునీరందిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్ చెప్పారు. జనావాసాల్లో ఉన్న తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని చెప్పారు. కాకినాడ కలెక్టరేట్ వివేకానంద సమావేశ మందిరంలో మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, అటవీ శాఖ, పర్యావరణశాఖలపై అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. నాలుగు గంటల పాటు జరిగిన సమీక్షలో అన్ని అంశాలపై వివరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ 'గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఏడాదికి వెయ్యి కోట్ల ఇసుక వ్యాపారం జరిగింది. ఐదేళ్లలో రూ.5 వేల కోట్ల రాబడి వచ్చినా జగన్ ప్రభుత్వం మాత్రం పంచాయతీల నిధులకు గండి కొట్టింది. గనుల సీనరేజీ నిధులు సైతం ఇవ్వకుండా దారి మళ్లించారు. వీటన్నింటిపై అధికారులను నివేదిక కోరినట్టు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చెప్పారు. గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వుకుని పంచాయ తీలకు చిల్లిగవ్వ కూడా పన్ను చెల్లించలేదన్నారు. ఈ పరిస్థితిని మార్చి ఉమ్మడి జిల్లాలో అన్ని పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి కలిగేలా చేస్తామన్నారు. కాకినాడకు అతి సమీపంలో ఉన్న కోరంగి మడ అడవులను గత వైసీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాల పేరుతో ధ్వంసం చేసింది. వేల టన్నుల కంకరతో మడ భూములను చదునుచేసింది. దీనివల్ల మడ అడవుల్లో ఉండే జీవరాశులు మనుగడ కోల్పోయే ప్రమాదం వాటిల్లిందన్నారు. తిరిగి మడ అడవుల అభివృద్ధికి చర్యలు తీసుకునేలా అధికారులకు ఆదేశాలు జారీచేసినట్టు చెప్పారు. కోరంగిలో ఎకో టూరిజం అభివృద్ధి చేస్తామన్నారు.ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కాకినాడ సముద్ర తీరంలో ఉన్న హోప్ ఐలాండ్‌ను సంరక్షిస్తామని, అక్కడున్న జీవులను కాపాడేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. కాకినాడ స్మార్ట్ సిటీకి సంబంధించి రావాల్సిన నిధులు, అభివృద్ధి పనుల విషయంపై ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ కేంద్రంతో మాట్లాడతారని తెలిపారు. ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామని చెప్పారు. సముద్రతీరాన్ని రక్షించే మడ అడవులను వైసీపీ పాలనలో నాశనం చేసి ఇళ్ల పట్టాలు ఇచ్చారని తెలిపారు. హానికరమైన మలేషియన్ బ్రీడ్ రకం కోనో కార్పస్ మొక్కలను పచ్చదనం కోసం పెంచారని, వాటిని దశలవారీగా తొలగిస్తామని చెప్పారు. ఉప్పాడ తీర ప్రాంతంలో సముద్రపు కోత వల్ల తీవ్ర నష్టం జరుగుతోందని, దాని పరిశీలనకు తాను బుధవారం వెళ్లనున్నట్టు తెలిపారు. చెన్నైకు చెందిన నిపుణుల బృందం పరిశీలనకు వస్తున్నట్టు చెప్పారు. వనాలు, జీవజాతుల పరిరక్షణలో ప్రజలను భాగస్వాములు చేయాలని సూచించారు. వ్యవస్థలను అన్నింటినీ గాడిలో పెడతామని తెలిపారు. సమావేశంలో కాకినాడ జిల్లా కలెక్టరు సగిలి షాన్‌మోహన్, జేసీ రామసుందరరెడ్డి, ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ, నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ, జడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎస్పీ సతీష్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న పవన్ కల్యాణ్ చిత్రంలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యేలు నెహ్రూ,కొండబాబు, నానాజీ, సత్యప్రభ

ఉప్పాడ తీరం ధ్వంసం కాకుండా చర్యలు

ఉప్పాడ తీరంలో ఏడాదిన్నర కాలంగా ఎకరం భూభాగం సముద్రపు కోతలో కలిసిపోయిందని. ఇలా ధ్వంసం కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. బుధవారం చెన్నై నుంచి వచ్చే నిపుణుల బృందం ఉప్పాడ తీరాన్ని పరిశీలించి దాన్ని రక్షణకు అవసరమైన చర్యలు సూచిస్తుందన్నారు. తద్వారా తీర సంరక్షణ చేపడుతున్నట్టు చెప్పారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. కేరళలో అధ్యయనం చేసిన తర్వాత కోనసీమలో కొబ్బరి ఉత్పత్తులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధుల సాయంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సైన్సు అండ్ టెక్నాలజీని అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే నన్నయ్య యూనివర్సిటీలో ఉన్న రీసెర్చ్ స్కాలర్లను తీసుకెళ్లి ఉప్పాడ తీర సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేస్తామని చెప్పారు.

నేడు పిఠాపురంలో పవన్ వారాహి సభ

పిఠాపురం/ఉప్పాడ, జూలై 2: పవన్‌కల్యాణ్ మూడో రోజు గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని తన నివాసం నుంచి బుధవారం ఉదయం 10 గంటలకు బయలుదేరి కొత్తపల్లి మండలం ఉప్పాడ చేరుకోనున్నారు. ఉదయం 10.45 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సముద్రపు కోత ప్రాంతాలను పరిశీలించి మత్స్యకారులతో మాట్లాడతారు. అక్కడ నుంచి 12 గంటలకు బయలుదేరి చేబ్రోలు నివాసానికి 12.45 గంటలకు చేరుకుంటారు. చేబ్రోలు నివాసంలో పిఠాపురం నియోజకవర్గానికి చెందిన అన్ని శాఖల అధికారులతో సమావేశమవుతారు. అనంతరం టీడీపీ, బీజేపీ ముఖ్య నేతలను కలుసుకుంటారు.భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరి సాయంత్రం 4 గంటలకు పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్‌కు చేరుకుంటారు. అక్కడ జరిగే వారాహి బహిరంగ సభలో పాల్గొని తనను గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రసంగిస్తారు. సభ అనంతరం సాయంత్రం ఆరు గంటలకు బయలుదేరి విజయవాడ వెళతారు.

పనులపై నివేదిక ఇవ్వండి

పంచాయతీరాజ్‌పై సమీక్ష సందర్భంగా జిల్లా, మండల పరిషత్ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనుల గురించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామచంద్రమూర్తి వివరించారు. దీనిపై పవన్ స్పందిస్తూ ఈ పనులు జిల్లా అంతటా జరిగాయా, లేక కొన్ని మండలాల్లోనే జరిగాయా అన్న విషయంపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలో 1 జడ్పీటీసీ, 13 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉందని జిల్లా కలెక్టరు సగిలి షాన్‌మోహన్ తెలిపారు. జిల్లాలోని మునిసిపాలిటీల్లో విలీనానికి ప్రతిపాదించిన 10 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగలేదని చెప్పారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 12 నియోజకవర్గాల పరిధిలోని 32 మండలాలకు నీరందించేందుకు రూ.1650 కోట్లతో జలజీవన్‌మిషన్ కింద ప్రతిపాదించిన వాటర్‌గ్రిడ్ పథకం హెడ్‌వర్క్స్‌కు అవసరమైన 14 ఎకరాల భూసేకరణ పూర్తికాక పనులు ముందుకు సాగలేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ తెలిపారు. పిఠాపురం-రాపర్తి మధ్య హైవే పనుల వల్ల సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌కు చెందిన పైపులైన్లు దెబ్బతినడంతో 17 ఆవాస ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎస్ఈ వివరించారు. నాగులాపల్లి స్కీమ్ ఇబ్బందులను తెలియజేశారు.

మా గుర్తుగా..



పవన్‌కల్యాణ్‌ను సత్కరించి ఫొటోలతో కూడిన జ్ఞాపిక అందజేస్తున్న చేబ్రోలులో పవన్ నివాసం ఉంటున్న ఇంటి యజమాని ఓదూరి నాగేశ్వరరావు కుటుంబీకులు

కాలుష్యకారక పరిశ్రమలపై చర్యలు

కాలుష్యంతో పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్న పరిశ్రమలపై కఠినంగా వ్యవహరిస్తామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. కాలుష్య నివారణ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వీరభద్ర ఎక్స్‌పోర్ట్స్ సంస్థపై తీసుకున్న చర్యలను తెలియజేయాలని పీసీబీ ఈఈ సందీప్‌రెడ్డిని ఆదేశించారు. శాస్త్ర సాంకేతిక శాఖకు సంబంధించి రాజమహేంద్రవరంలో ఏర్పాటుచేస్తున్న కేంద్రాన్ని త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. విద్యార్థుల్లో సాంకేతికపై ఆసక్తి కలిగేలా కేంద్రాన్ని తీర్చిదిద్దాలన్నారు.

పర్యాటక ప్రాజెక్టును కోరాం

కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాకు ప్రసాద్ పథకం కింద పర్యాటక ప్రాజెక్టు, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏర్పాటుకు ప్రధానమంత్రి మోదీని కోరామని తెలిపారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) మాట్లాడుతూ ఆగిపోయిన స్మార్ట్‌సిటీ పనులు తిరిగి ప్రారంభించాలని కోరారు. నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి గతంలో ఏటిమొగ వద్ద ఉప్పుటేరుపై శంకుస్థాపన చేసిన బ్రిడ్జి పనులు తిరిగి ప్రారంభించాలని కోరారు.

మాజీలకు గన్‌మెన్‌లు ఇంకానా!?



- గత నెల 4న ఫలితాలు విడుదల
- 28 రోజులుగా మాజీలకు గన్‌మెన్‌లు
- కొనసాగింపుపై విమర్శలు
- 'తూర్పు'లో 'త్రెట్'పై ఎద్దేవా
- ఇటీవల భరత్ వాహనం దహనం
- డీజీపీకి మాజీ ఎంపీ వినతి
- గతంలో టీడీపీ స్వచ్ఛందంగా వెనక్కి
- ఇప్పుడు నెల కొనసాగింపు
- నేటితో ముగియనున్న పొడిగింపు

ప్రజలు ఓటుతో వద్దన్నా.. వదలని దర్పం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

'తూర్పు' ఎప్పుడూ ప్రశాంతమే. నాయకులపై దాడులు జరిగిన ఘటనలు లేవు. భద్రతకు వచ్చిన ముప్పు లేదు.ఈ నేపథ్యంలో గతంలో ఓడిపోయిన వెంటనే టీడీపీ నేతలు స్వచ్ఛందంగా తమకు కల్పించిన గన్‌మెన్ సౌకర్యాన్ని వదులుకున్నారు. కానీ ఈ సారి ఎన్నికల్లో ప్రజలు ఓటుతో చాచి కొట్టినా వైసీపీ నాయకులు మాత్రం దర్పం వెలగబెట్టడానికి వెనుకాడడం లేదు. అధికారులను బ్రతిమలాడి గన్‌మెన్ గడువును ఈ నెల 4వ తేదీ వరకూ పొడిగించుకున్నారు.మరి రేపటితో వారిని డిపార్ట్‌మెంట్‌కి పంపేస్తారా లేదా ఏదైనా ఎత్తుగడ పారించి మరి కొద్ది రోజులు పొడిగింపజేసుకుంటారా?అనే చర్చ నడుస్తోంది.

మాజీలైనా వదలరా?

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలు, మంత్రులు ఇలా కొన్ని విభాగాల ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం గన్‌మెన్ సదుపాయాన్ని ఇస్తుంది. ప్రజా ప్రతినిధులు నిత్యం ప్రజల్లో తిరుగుతుంటారని, వారు తీసుకొనే నిర్ణయాలపై కూడా కొందరికి వ్యతిరేకత ఉండొచ్చని.. భద్రత దృష్ట్యా గన్‌మెన్‌లను ఇస్తారు. సాధారణంగా ఒక్కొక్కరికి ఇద్దరు చొప్పున గన్‌మెన్‌లను పోలీసు శాఖ నుంచి కేటాయిస్తారు.పదవిలో ఉన్నంత సేపు వీళ్లు కొనసాగుతారు. ఓటమి పాలైతే మాత్రం నాయకులే స్వచ్ఛందంగా గన్‌మెన్‌లను అప్పగించాలి. వాస్తవానికి జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి.జిల్లాలోని ఒక ఎంపీ, ఏడు అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు జయ కేతనం ఎగురవేశారు. వైసీపీకి ఒక్క సీటు దక్కలేదు. వైసీపీ ప్రజాప్రతినిధులు మాజీలు అయిపోయారు. కానీ ప్రభుత్వం కల్పించే గన్‌మెన్ సదుపాయం ఇప్పటికీ వాడుకుంటున్నారు. దీని వల్ల వారికి జీతాలుగా ఇచ్చే ప్రజాధనం వృథా అవుతోంది. జిల్లాలో వైసీపీ మాజీలకు 10 మంది గన్‌మెన్‌లు ఇంకా విధుల్లో ఉన్నారు.అంటే.. నెలకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున లెక్క వేసినా రూ.5 లక్షలు అనవసర ఖర్చు.

ఇక్కడ భయమెందుకు?

ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతాలు ఉండే రాయలసీమ, నక్సల్స్ ప్రభావం ఉండే ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులకు రక్షణగా గన్‌మెన్‌లు కచ్చితంగా ఉండి తీరాల్సిందే. అయితే ఎలాంటి భద్రత పరమైన ఇబ్బందులూ లేకపోయినా తూర్పుగోదావరిలో వైసీపీ మాజీ ప్రతినిధులకు గన్‌మెన్లను కొనసాగించడం విమర్శలకు తావిస్తోంది. ఎంపీగా పదవిలో ఉన్నప్పుడు రాజమహేంద్రవరం సిటీని మాత్రమే పట్టుకుతిరిగిన భరత్‌రామ్‌కి రక్షణపరంగా సమస్య ఏమిటో ఎవరికీ అర్థం కావడం లేదు.హోం మంత్రిగా పనిచేసినప్పుడు సాహసోపేతమైన నిర్ణయాల జోలికి వెళ్లని మాజీ హోం మంత్రి వనితకు సైతం గన్‌మెన్ ఉండడంపై మండిపడుతున్నారు. జిల్లాలో మాజీ హోం మంత్రి తానేటి వనిత, మాజీ ఎంపీ భరత్ రామ్,రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, గోపాలపురం మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నిడదవోలు మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడుకు ఇద్దరు చొప్పున గన్ మెన్‌లు కొనసాగుతున్నారు. శ్రీనివాసనాయుడుకు జిల్లా నుంచి ఒకరు, భీమవరం నుంచి మరొకరు ఉన్నారు. వనితకు జిల్లా నుంచి ఒకరు, విజయవాడ నుంచి మరొకరు విధుల్లో ఉన్నారు. ప్రజాధనం వృథా చేయకూడదనే బాధ్యత ఉంటే ఎన్నికల్లో ఓటమి చెందిన వెంటనే గన్‌మెన్‌లను వెనక్కి పంపేసి హుందాగా చాటుకోవాలి.కానీ గన్‌మెన్‌లను మరికొంత కాలం కొనసాగించాలని ఈ మాజీలు కోరడం చూస్తుంటే పదవిపోయినా దర్పం వదలడానికి ఇష్టపడ ట్లేనట్లుగా కనిపిస్తోంది.

త్రెట్ ఉందా?.. ఎత్తుగడా!


గన్‌మెన్‌ల సదుపాయాన్ని కల్పించడం, వారిని వెనక్కు రప్పించడం వంటివి త్రెట్ పెర్‌ఫెక్షన్ రిపోర్టు(టీపీఆర్) ఆధారంగా జరుగుతాయి. పోలీస్ నిఘా విభాగం తగు సమాచార సేకరణ ద్వారా టీపీఆర్‌ని తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తుంది. దాని ఆధారంగా భద్రత కల్పించడం జరుగుతుంది. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కూడా టీపీఆర్ ఆధారంగానే గన్‌మెన్‌లను వెనక్కు పిలిపిస్తారు. అయితే ఈ సారి చిన్న చిన్న ఘటనలను చూపి గన్‌మెన్‌లను నెల పాటు కొనసాగించాలనే ఆదేశాలు ఇచ్చారని తెలుస్తోంది. ఆ ఉత్తర్వుల ద్వారా సదుపాయాన్ని జూలై 4వ తేదీ వరకూ కల్పించారు. ఎన్నికల అనంతరం జిల్లాలో జరిగిన చెదురు మదురు సంఘటనలను సాకుగా చూపి గన్‌మెన్ సదుపాయాన్ని పొడిగించాలని కోరే ఎత్తుగడ వేస్తారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఎన్నికల కౌంటింగ్ తర్వాత నల్లజర్లలో రాళ్లు రువ్వుకోవడం జరిగింది. వాస్తవానికి దీనిని అక్కడి తాజాలు, మాజీలు కూడా పెద్దగా పట్టించుకోలేదు. మొన్న శుక్రవారం(28)న రాత్రి మాజీ ఎంపీ భరత్‌రామ్ తన ప్రచార రథాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారంటూ హడావుడి చేశారు. కానీ 2వ తేదీ వరకూ పోలీసులకు ఫిర్యాదు మాత్రం చేయలేదు. డీజీపీని కలిసి వినతిపత్రం ఇచ్చి అనంతరం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలాంటి ఘటనలను దర్పం కొనసాగింపునకు సాకుగా చూపుతారనే చర్చ నడుస్తోంది. తమ నేత జగన్ తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వాలంటూ గోల పెడుతుండగా.. ఆయన బాటలో నడిచే నాయకులు గన్‌మెన్‌ని కొనసాగించాలని గగ్గోలు పెట్టడంలో ఆశ్చర్యం ఏముందని ఎద్దేవా చేస్తున్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత మాజీ మంత్రి వేణు మాత్రమే తన గన్‌మెన్‌లను స్వచ్ఛందంగా వెనక్కి పంపేశారు. అంటే, జిల్లాలో ఈయనకు తప్ప మిగతా వారందరికీ త్రెట్ ఉన్నట్లా?.. లేక పదవిలో ఉన్నప్పుడు వారే పని చేసి ఈయన ఖాళీగా ఉన్నట్టా!?.



మాజీ ఎంపీ భరత్ వెనుక ఉన్న గన్‌మెన్

రేపు విద్యాసంస్థల బంద్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 2 : నీట్ పరీక్ష పేపర్ లీకేజీని నిరసిస్తూ పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ తదితర విద్యార్థి సంఘాలు జూలై 4వ తేదీన బంద్‌కు పిలుపును ఇచ్చాయి. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరం ఎస్కేవీటీ కళాశాలలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర జనరల్ కార్యదర్శి జి.తారకేశ్ పోస్టర్ ఆవిష్కరించారు. ఎల్‌కేజీ టు పీజీ వరకూ అన్ని విద్యాసంస్థలు బంద్‌లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజా, పీడీఎస్‌యూ కె.భాను, రాంబాబు, దినేష్, శివ తదితరులు పాల్గొన్నారు.



ఇసుక పాలసీ ఎలా..

కూటమి ప్రభుత్వంలో ఇసుక పాలసీ ఎలా ఉంటుందోనని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.. గత 2014 ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు సీఎం ఉచిత ఇసుక విధానం తెచ్చారు.. మరిప్పుడేం చేస్తారోనని చూస్తున్నారు. - వివరాలు 7లో

రేపటి నుంచి ఏపీఈఏపీ సెట్ ధ్రువపత్రాల పరిశీలన

ఏపీఈఏపీసెట్-2024 అడ్మిషన్లకు ఎంపీసీ విభాగం అభ్యర్థులకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ఈనెల 4నుంచి జరుగనుంది. ఆన్‌లైన్ వెబ్‌కౌన్సెలింగ్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. దీని ద్వారా ఇంజనీరింగ్ కళాశాలల్లోని సీట్లను భర్తీచేయనున్నారు. - వివరాలు 7లో

7

బ్యాంక్ ఆఫ్ బరోడా బీసీ పాయింట్‌లో 40 లక్షలు గోల్‌మాల్?

ఇంకా పదవిలోనేనా?

ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కూడా కార్లపై మెంబర్ ఆఫ్ పార్లమెంట్, ఎమ్మెల్యే అనే స్టిక్కర్లను అలాగే ఉంచడం.. వాటిలోనే తిరుగుతుండడం మరో రకమైన వెర్రి అంటూ పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. మాజీలు అయిపోయి 26 రోజులు గడిచినా ఇంకా ఆ యావ పోకపోవడంపై ఎద్దేవా చేస్తున్నారు.వీళ్లు స్టిక్కర్లు పెట్టుకొని తిరుగు తుంటే.. తాజాగా ప్రజలు గెలిపించుకున్న వాళ్లు ఏ స్టిక్కర్లు తమ కార్లకు వేసుకోవాలని ప్రశ్నిస్తున్నారు.



మాజీ ఎంపీ భరత్ కార్లపై ఉన్న మెంబర్ ఆఫ్ పార్లమెంట్ స్టిక్కరింగ్



సూర్యోదయం ఎంతో ఆహ్లాదకరం

గోదావరి తీరంలో సూర్యోదయం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. అదే మబ్బులు వేసిన సమయంలో మరింత అందాలు కనువిందు చేస్తాయి. ఇదేవిధంగా మంగళవారం ఉదయం పెరవలి మండలం తీపర్రువద్ద గోదావరి తీరానికి వెళ్లిన పలువురికి ఈ సూర్యోదయం ఎంతో ఆహ్లాదకర అనుభవాన్ని ఇచ్చింది.

-పెరవలి

15 వరకు భీమేశ్వరాలయంలో సంరక్షణ పనులు

ద్రాక్షారామ, జూలై 2: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న మూలవిరాట్ సంరక్షణ పనులు ఈనెల 15వరకు కొనసాగనున్నాయి. ఈమేరకు పురావస్తుశాఖ అధికారులు ఈవో పి.టి.వి.సత్యనారాయణకు సమాచారం ఇచ్చారు. దీంతో భీమేశ్వరుడి మూల విరాట్, మాణిక్యాంబ అమ్మవార్లదర్శనం మరో కొన్నిరోజులు పట్టే అవకాశం ఉందని ఈవో తెలిపారు.

రేపటి నుంచి ఏపీఈఏపీసెట్

అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

- ఈనెల 7వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్
- 8నుంచి 12వరకూ వెబ్ ఆప్షన్ల నమోదు
- కాకినాడలో రెండు సహాయ కేంద్రాలు

జేఎన్టీయూకే, జూలై2: ఏపీఈఏపీసెట్-2024 అడ్మిషన్లకు ఎంపీసీ విభాగం అభ్యర్థులకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ఈనెల 4నుంచి జరుగనుంది. ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. దీని ద్వారా ఇంజనీరింగ్ కళాశాలల్లోని సీట్లను భర్తీచేయనున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఏపీఈఏపీసెట్ అడ్మిషన్స్ కన్వీనర్ ఆదివారం జారీ చేశారు. ఈనెల 7వరకూ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపుచేసుకోవచ్చని కాకినాడ జేఎన్టీయూకేలోని యూసీఈకే సహాయకేంద్రం సమన్వయకర్త ప్రొఫెసర్ ఎన్.బాలాజీ తెలిపారు.

● ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో 2 ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలుండగా జేఎన్టీయూకేలోని యూసీఈకే, రాజానగరంలో గల అక్నూలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో 950 సీట్లు, 32 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో 15,400 సీట్లు మొత్తం 16,350 సీట్లున్నాయి. ఏపీఈఏపీసెట్‌లో ఇంజనీరింగ్‌కు 14,250 మంది, ఫార్మసీకి 6,757 మంది అర్హత సాధించారు.

సందేశాల నివృత్తికోసం

●అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే జిల్లాలోని కాకినాడ జగన్నాథపురం ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన సహాయకేంద్రంలోగానీ, కాకినాడ జేఎన్టీయూకేలోని యూసీఈకేలో ఏర్పాటుచేసిన సహాయకేంద్రంలో కానీ సంప్రదించాలి. అంతేకాకుండా 7995681678, 7995865456, 9177927677 హెల్ప్‌డెస్క్ నెంబర్లకు ఫోన్‌చేయవచ్చు.

● ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఇలా చేసుకోవాలి

అభ్యర్థులు మొదటిగా https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి అడ్మిషన్లపై క్లిక్ చేయాలి. అనంతరం వచ్చిన ఫారంలో హాల్ టికెట్ నెంబరు, పుట్టిన తేదీ నమోదు చేస్తే రిజిస్ట్రేషన్ ఫారం వస్తోంది. అందులో అడిగిన సమాచారం క్షుణ్ణంగా నింపి సబ్‌మిట్‌చేయాలి. అనంతరం పది, ఇంటర్ మార్కుల జాబితాలు, 6నుంచి ఇంటర్‌వరకూ స్టడీ, టీసీ, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు. ర్యాంకు కార్డు, రేషన్ కార్డు, హాల్‌టికెట్లను అప్‌లోడ్ చేయాలి. ఈడబ్ల్యూఎస్ కుల ధ్రువీకరణపత్రం ఉన్న వారికి 2022నుంచి 10శాతం రిజర్వేషన్‌ను ప్రతీ ఏడాది అమలుచేస్తున్నారు.

షెడ్యూల్ ఇదే

● ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజుచెల్లింపు, రిజిస్ట్రేషన్	: ఈనెల 7 వరకూ.
● ధ్రువపత్రాల పరిశీలన	: ఈనెల 4నుంచి 10వరకూ
● వెబ్ ఆప్షన్ల నమోదు	: ఈనెల 8నుంచి 12వరకూ
● ఆప్షన్ల మార్పు	: ఈనెల 13న
● సీట్ల కేటాయింపు	: ఈనెల 16న
● కళాశాలల్లో రిపోర్టింగ్	: ఈనెల 17నుంచి 22 వరకూ.
● తరగతుల ప్రారంభం	: ఈనెల 19 నుంచి

● విద్యార్థులు సిద్ధం చేసుకోవాల్సినవి : ర్యాంకు కార్డు, మార్కులజాబితా, హాల్‌టికెట్, పుట్టినరోజు, టీసీ, స్టడీ ధ్రువపత్రం, ఈడబ్ల్యూఎస్, నివాస, కులధ్రువీకరణ, ఆదాయ, స్థానికత ధ్రువపత్రాలను విద్యార్థులు సిద్ధం చేసుకోవాలి.

● పీహెచ్, క్యాప్, ఎన్‌సీసీ, స్కౌట్స్, గైడ్స్, స్పోర్ట్స్, గేమ్స్, ఆంగ్లో ఇండియన్ కేటగిరీ అభ్యర్థులకు మాత్రం ఈనెల 6 నుంచి విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నారు.

రూ.40 లక్షలు గోల్‌మాల్!

- జి.ఎర్రంపాలెంలోని బరోడా బ్యాంక్‌లో ఘటన
- చెల్లింపులు, రికార్డుల్లోని వివరాల్లో తేడాలు
- బ్యాంకులో బీసీ పాయింట్ వ్యక్తిపై అనుమానాలు





స్వయంసహాయక సంఘానికి ఇచ్చిన రశీదు, వివరాలను తెలియజేస్తున్న డ్వాక్రా మహిళలు

దివాన్‌చెరువు, జూలై 2: తూర్పుగోదావరిజిల్లా రాజానగరం మండలంలోని జి.ఎర్రంపాలెంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలో దాదాపు రూ.40లక్షలు మేర సొమ్ము గోల్‌మాల్ జరిగినట్టు తెలుస్తోంది. బ్యాంకులో బీసీ పాయింట్‌కు చెందిన వ్యక్తి ఈ అవకతవకలకు పాల్పడినట్టు కొంతమంది ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరగాల్సి ఉంది. దీనికి సంబంధించి వివరణ ఇచ్చేందుకు బ్యాంకు బ్రాంచి మేనేజర్ నిరాకరించారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించాలని కొందరికి ఫోన్లు వెళ్లడం, కొన్ని స్వయం సహాయక సంఘాలు చెల్లించిన సొమ్ముకు, బ్యాంకు రికార్డుల్లో నమోదైన సొమ్ములో తేడాలుండడంతో ఈ వ్యవహారం వెలుగు చూసింది. ఖాతాదారుల సౌకర్యార్థం ఒక వ్యక్తిని తమ ప్రతినిధిగా బ్యాంకు నియమించుకుంది. ఖాతాదారులకు బ్యాంకు వెలుపల ఆ వ్యక్తి అందుబాటులో ఉండి సేవలందించాల్సి ఉంది. అయితే అందుకు భిన్నంగా జి.ఎర్రంపాలెంలోని బీసీ పాయింట్‌కు చెందిన వ్యక్తి బ్యాంకు ఆవరణలోనే ఉంటూ డ్వాక్రా సంఘాలు, రైతులు బ్యాంకుకు చెల్లించాల్సిన సొమ్ములో కొంత తానే కట్టించుకుని రశీదులు ఇచ్చేవారని కొంతమంది డ్వాక్రాసంఘాల సభ్యులు తెలిపారు. దీంతో వారంతా బ్యాంకు ప్రతినిధులే అయి ఉంటారని తాము అనుకున్నామన్నారు. ఆ గ్రామంలోని మేరీమాత స్వయం సహాయక సంఘానికి చెందిన కోనె లక్ష్మిని విలేకరులు ఈ విషయమై ప్రశ్నించగా ఐదు నెలలుగా తాము చెల్లించిన రూ1.20 లక్షలు సొమ్ము తేడా వచ్చిందన్నారు. తాము బ్యాంకులో చెల్లించిన సొమ్ము బాగానే ఉందని, బ్యాంకు ప్రతినిధి నానిబాబు అనే వ్యక్తికి చెల్లించిన సొమ్ములోనే ఈ వ్యత్యాసం వచ్చిందన్నారు. బ్యాంకుకు తాము వచ్చినపుడు రూ.10 వేలలోపు సొమ్మును తమ బ్యాంకు ప్రతినిధికి చెల్లించాల్సిందిగా కొంతమంది బ్యాంకు సిబ్బందే తమకు చెప్పేవారన్నారు. సుజాత గ్రూపునకు చెందిన దమ్ము దుర్గ మాట్లాడుతూ తమ సంఘానికి సంబంధించి రూ.20వేలు తేడా వచ్చాయన్నారు. శారదా గ్రూపునకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు పోశమ్మ, యజ్ఞ కళ్యాణి మాట్లాడుతూ తమ సంఘం పొదుపు సొమ్ము బ్యాంకుకు రూ.92 వేలు చెల్లిస్తే తమ ఖాతాలో ఏడు వేలు మాత్రమే కనబడుతోందని చెప్పారు. రెండు సంవత్సరాల క్రితం తమకు రూ.60 వేలు రుణం వచ్చిందని, అప్పటి నుంచీ తమ ఖాతాలో పొదుపు సొమ్ములేదని గుర్తించామన్నారు. ఈ విషయమై యానిమేటర్‌ను అడగగా అప్పులు ఆలస్యంగా చెల్లించిన వారికి పొదుపు సొమ్ము అప్పుకు జమచేసి ఉండవచ్చని తెలిపారన్నారు. తాము ఈ లోపాలను గుర్తించి కొంతకాలంగా బ్యాంకు చుట్టూ తిరుగుతుంటే నాలుగు రోజుల్లో చెబుతామని సిబ్బంది అన్నారన్నారు. సత్యసాయి స్వయం సహాయక సంఘానికి సంబంధించి రూ.60 వేల వరకూ తేడా వచ్చినట్టు తెలిసింది. జి.ఎర్రంపాలెం, సంపత్‌నగరం, పుణ్యక్షేత్రం గ్రామాల్లోని 93 స్వయం సహాయక సంఘాల వారు ఈ బ్యాంకు ద్వారా లావాదేవీలు జరుపుతున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. అలాగే ఖాతాదారులు బ్యాంకు ద్వారా నగదు జమ, విత్‌డ్రా వంటి లావాదేవీలు జరిపినపుడు సంబంధిత పాస్ పుస్తకాల్లో ఎంట్రీలను ఎప్పటికపుడు సిబ్బంది నమోదుచేసి ఉంటే ఇటువంటి వాటికి ఆస్కారం ఉండేది కాదని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయమై బ్రాంచి మేనేజర్ బీఎస్ రాజును మంగళవారం విలేకరులు కలసి ప్రశ్నించగా వివరణ ఇచ్చేందుకు నిరాకరించారు.

మహిళ అదృశ్యం కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- పవన్‌ను కలిసిన ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిసిన ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

పిఠాపురం/గొల్లప్రోలురూరల్, జూలై 2: మహిళల అదృశ్యం కేసులపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తిస్థాయిలో విచారణలు నిర్వహించాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని నివాసంలో పవన్‌ను మంగళవారం రాత్రి ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై పవన్ ఐజీతో మాట్లాడారు. అదృశ్యమైన బాలికలు, మహిళలు ఇతర రాష్ట్రాలకు వెళుతున్నారు, అందుకు గల కారణాలు ఏమిటి, అదృశ్యాలు వెనుక ఎవరు ఉన్నారు, కారణాలు ఏమిటి తదితర అంశాలన్నింటిపై దృష్టి పెట్టాలన్నారు. కాకినాడ జిల్లాలో గతంలో జరిగిన సంఘటనలు, ప్రస్తుత పరిస్థితి గురించి ఆరా తీశారు. శాంతి భద్రతలు విఘాతం కలిగించేవారిపై, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. పోలీసుస్టేషన్లకు వచ్చే ప్రజలపట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని తెలిపారు. ఐజీ వెంట జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, అడిషనల్ ఎస్పీ భాస్కరరావు, డీఎస్పీ హనుమంతరావు, పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఉన్నారు.

వేటకు వెళ్లిన మత్స్యకారుడి మృతి

కొత్తపల్లి, జూలై 2: వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి చెందినట్టు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం పొన్నాడ శివారు కోనపాపపేటకు చెందిన చొక్కా మసేను(52) అదే గ్రామానికి చెందిన కొంతమంది మత్స్యకారులతో మంగళవారం తెల్లవారుజామున వేటకు వెళ్లారు. సముద్రంలో వేట చేస్తుండగా కెరటాల ఉధృతికి మసేను సముద్రంలో పడి గల్లంతయ్యాడు. దీంతో సహచర మత్స్యకారులు వలలతో గాలించినా ఆచూకీ దొరక్కపోవడంతో ఒడ్డుకు చేరుకున్నారు. సాయంత్రం 4గంటల సమయంలో మసేను మృతదేహం ఒడ్డుకు కొట్టుకొని రావడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.



అధికారులపైకి దూసుకెళ్తున్న మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి

హైడ్రామా

- అక్రమ కట్టడాలకు అండగా ద్వారంపూడి
- అధికారులపై వీరంగం.. అడ్డగోలుగా విరుచుకుపడ్డ చంద్రశేఖర్‌రెడ్డి
- అనుచరులతో దాడి.. ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలు
- అధికారుల హెచ్చరికతో వెనుదిరిగిన మాజీ ఎమ్మెల్యే

కార్పొరేషన్(కాకినాడ), జూలై2: అధికారంలో ఉన్నప్పుడు కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అక్రమాలకు, అరాచకాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేవారు. ఆనాడు ప్రతిపక్షపార్టీల నేతలు ధ్వజమెత్తినా, బాధితులకు ఆక్రోశించినా పట్టించుకున్నవారే లేరు. పైగా అవేమీ తనకు సంబంధం లేదన్నట్టుగా ఈ మాజీ ఎమ్మెల్యే అప్పట్లో తన నోటికి పనిచెప్పి ఎంతోమందిని దుర్భాషలతో దూషించేవారు. ఆఖరికి మీడియాను సైతం బెదిరించేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. ఇటీవల ఎన్నికల్లో ఘోరంగా ఓటమిపాలయ్యారు. పదవిపోయిందనే, ప్రజలు తిరస్కరించారనే స్పృహ చంద్రశేఖర్‌రెడ్డికి ఇప్పటికీ కలగలేదు. తానింకా అధికారంలో ఉన్నట్టుగానే అటు ప్రజలపైనా, ఇటు అధికారులపైనా వీరంగం చేస్తున్నారు. అలాంటి సంఘటన కాకినాడలో గొడారిగుంట ప్రాంతంలో మంగళవారం జరిగింది. స్థానిక రాజ్యలక్ష్మినగర్‌లో వైసీపీ కార్యకర్త, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి అనుచరుడు ఒకరు అక్రమంగా ఒక భవంతిని నిర్మించాడు. మొదటి ఫ్లోర్ వరకు అనుమతులు ఉండగా, అప్పట్లో అధికార అండతో అడ్డగోలుగా రెండో ఫ్లోర్ కూడా అధికారులను బెదిరించి నిర్మించేశారు. ఇది గమనించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు అడ్డగోలుగా అనుమతులు లేకుండా నిర్మించిన రెండో ఫ్లోర్‌ను కూల్చివేయాలని నోటీసులు ఇచ్చారు. వారం రోజుల కిందటే ఈ నోటీసులు ఇచ్చినప్పటికీ సంబంధిత వైసీపీ కార్యకర్త, చంద్రశేఖర్‌రెడ్డి అనుచరుడు ఇసుమంతైనా స్పందించలేదు. కనీసం అధికారులకు జవాబు కూడా ఇవ్వలేదు. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు మంగళవారం రంగంలోకి దిగి రెండో అంతస్తు కూల్చే ప్రయత్నం ప్రారంభించారు. ఈ విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి అక్కడ ప్రత్యక్షమయ్యారు. ఇంకా అధికారంలోనే ఉన్నట్టుగా అధికారులను బెదిరించారు. భవనం వద్ద ఉన్న దిగువస్థాయి అధికారులందరినీ వెళ్లిపొమ్మని హెచ్చరించారు. భవనం పైఅంతస్తు కూల్చే పని పర్యవేక్షిస్తున్న అధికారులను నిలువరించి తన అనుచరులతో వీరంగం సృష్టించారు. అంతటితో ఆగకుండా రెండో ఫ్లోర్‌కి చేరుకుని అప్పటికే భవనాన్ని కూల్చడానికి కార్పొరేషన్ అధికారులు నియమించిన కూలీలపై మాజీ ఎమ్మెల్యే అనుచరులు దాడికి పాల్పడ్డారు. అక్కడ ఉన్న ఇటుక రాళ్లు తీసి ఇద్దరిని తీవ్రంగా గాయపరిచారు. ఈ దాడిలో పలువురు కూలీలకు కూడా గాయాలయ్యాయి. తప్పని పరిస్థితుల్లో అక్కడున్న కూలీలందరూ పక్క భవనంపైకి దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. అంతటితో ఆగకుండా కింద ఉన్న టౌన్‌ప్లానింగ్ అధికారులకు ద్వారంపూడి తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇంతలో అక్కడున్న పోలీసులు ఎంత అడ్డుకుందామని ప్రయత్నించినా చంద్రశేఖర్‌రెడ్డి తన అనుచరులతో రెచ్చిపోయి ఎదురుదాడికి దిగారు. దుర్భాషలతో అధికారులను దూషించారు. పై అధికారులకు ఫిర్యాదు చేస్తానంటూ చంద్రశేఖర్‌రెడ్డి ఫోన్లో ప్రయత్నించారు. నిబంధన ప్రకారమే ఈ చర్యలకు దిగామని, అక్రమ నిర్మాణాలపై చర్యలను అడ్డుకోరాదంటూ ఉన్నతాధికారుల నుంచి సమాధానం రావడంతో చేసేదిలేక ద్వారంపూడి అక్కడ నుంచి వెళ్లిపోయారు. కాగా టౌన్ ప్లానింగ్ అధికారి డీసీపీ హరిదాస్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ అక్రమ నిర్మాణం విషయంలో అంతా నిబంధన ప్రకారమే జరుగుతోందని స్పష్టంచేశారు.

మొబైల్ యాప్ ద్వారా

విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు



మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్

అమలాపురం టౌన్, జూలై 2: తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఏపీఈపీడీసీఎల్ మొబైల్, వెబ్‌సైట్ యాప్ ద్వారా చెల్లించవచ్చని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్బీఐ మార్గదర్శకాలను అనుసరించి ఇక మీదట ఫోన్ పే, జీపే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్స్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించేటప్పుడు ఏపీఈపీడీసీఎల్ పేరు కనిపించదన్నారు. కాబట్టి వినియోగదారులు సంస్థ మొబైల్ యాప్ ఈస్ట్రన్ పవర్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకుని సంస్థ వెబ్‌సైట్ ద్వారా బిల్లులు చెల్లించవచ్చన్నారు. మొబైల్ యాప్, వెబ్ సైట్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించేటప్పుడు వినియోగదారులు తమ ఫోన్ పే, జీపే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్స్‌తో పాటు డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, క్యాష్ కార్డులను కూడా వాడుకోవచ్చని పృథ్వీతేజ్ వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు.

సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



పీఆర్వోకు విరాళం అందజేస్తున్న దాత ఆకెళ్ల యశోద

అన్నవరం, జూలై 2: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి మంగళవారం హైదరాబాద్‌కు చెందిన ఆకెళ్ల యశోద రూ.1,00,116లు విరాళంగా దేవస్థానం పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. ఈసందర్భంగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు. సూపరింటెండెంట్ స్వామీజీ ఉన్నారు.



ఇసుక పాలసీ ఎలా ఉంటుందో?

- ఎదురు చూస్తున్న ప్రజలు
- జిల్లాలో ఆగిపోయిన ర్యాంపులు
- జిల్లాలో ఇసుక కొరత
- కూటమి అధికారంలోకి రావడంతో పరారైన వైసీపీ ఇసుక దొంగలు
- కలెక్టర్ ఆదేశాలలో లెక్కలు కడుతున్న అధికారులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడడం, మళ్లీ సీఎంగా నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టడంతో ఇసుక వినియోగదారులు, వ్యాపారులు, బోట్స్‌మన్ సొసైటీలు ఆనందంగా ఉన్నాయి. 2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చినపుడు చంద్రబాబు ఉచిత ఇసుక విధానం తేవడంతో భవన నిర్మాణ రంగం అభివృద్ధి చెందింది. భవన నిర్మాణ రంగం మీద ఆధారపడిన వేలాది కార్మికులు హ్యాపీగా ఉండేవారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలు కూడా ఇల్లు కట్టుకోవాలంటే, ఇసుక ఇబ్బంది ఉండేది కాదు.కేవలం ఎగుమతి, రవాణా చార్జీలు పెట్టుకుంటే ఇసుక ఇంటికి వచ్చేది. కానీ 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వినియోగదారుల కోణం నుంచి ప్రభుత్వం ఆలోచించలేదు. అంతా ఆదాయ మార్గంగానే ఆలోచించింది. పైగా బోట్స్‌మన్ సొసైటీలు, ఇసుక వ్యాపారు లందరినీ దెబ్బకొట్టి, కేవలం జిల్లాకు ఒకరిద్దరువ్యక్తులను పెట్టుకుని, వాళ్ల ఆధ్వర్యంలో ఇసుక తవ్వకాలు, అమ్మకాలు జరిపిన సంగతి తెలిసిందే. జిల్లాల వారీ పెద్ద సంస్థలకు కాంట్రాక్టు ఇచ్చినట్టు మొదట్లో ఇసుక పాలసీ ప్రకటించినా తర్వాత దానిని ప్రక్కన పడేసి, వైసీపీ పెద్దలే ఇసుక బొక్కడం మొదలు పెట్టిన సంగతి తెలిసిందే. ఓపెన్ ర్యాంపుల్లో ఎమ్మెల్యేలు, ఎంపీ, ఇతర వైసీపీ నేతలు ఇసుక రంగంలోకి దిగి, బోట్స్‌మన్ సొసైటీలను తరిమేసి, వారిస్థానంలో తమ అనుచరులనుపెట్టుకుని ఇసుక డ్రెడ్జింగ్ చేయించి, దానిని వైసీపీ తరపున ఉన్న గుత్తేదార్లకు అందించేవారు. టన్నుకు రూ. 150నుంచి 200వరకూ రావడంతోపాటు బాట చార్జీలు అదనంగా వచ్చేవి. పార్కింగ్ చార్జీలు కూడా వసూలు చేసేవారు. మధ్యలో కొన్ని లారీలను లెక్కలో లేకుండా తప్పించేవారు. ర్యాంపుల వద్ద వైసీపీ తరపున వ్యక్తులు కాపాలా కాసి, డిజిటల్ లావాదేవీలు లేకుండా, కేవలం నగదు లావాదేవీలే చేసేవారు. ఇక్కడ మరొక్క విషయం గమనించాలి. గతంలో ర్యాంపులు ఎంపిక చేయాలంటే ఇరిగేషన్, మైన్స్, భూగర్భజలశాఖ, రెవిన్యూ వంటి శాఖల అధికారులంతా పర్యటించి,అక్కడ సరిహద్దులు నిర్ణయించి, ఎంత ఇసుక తవ్వు కోవచ్చో లెక్క కట్టేవారు. దాని వివరాలను జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశంలో చర్చించి, పర్యావరణ అనుమతులు పొం దిన తర్వాత ఇసుక తీసుకోవడానికి అనుమతి ఇచ్చేవారు. కానీ వైసీపీ ప్రభుత్వం అవేవీ లేవు.కేవలం వాళ్లు అనుకోవడం, తవ్వే సుకోవడం, అమ్మేసుకోవడం, డబ్బు మూటలు పట్టుకుని పోవడం అంతే జరిగింది. ఏ ర్యాంపులో ఎంత ఇసుక తవ్వారో కూడా లెక్కలులేని వైనం. మైన్స్, ఇరిగేషన్ ,రెవెన్యూ, సెబ్, పోలీసు, భూగర్భజలశాఖ, అటవీ, సంబంధిత శాఖలన్నీ నిర్వీర్యమ య్యాయి. ఇరిగేషన్, మైన్స్ అధికారుల అనుమతి లేకుండా రూ.కోట్ల ఇసుక తవ్వేశారు. నెలకు రూ.10కోట్ల వరకూ వైసీ పీ పెద్దలకు కప్పం అందేది. కొవ్వూరులో వైసీపీ పార్టీకి చెం దిన వ్యక్తి, పశ్చిమగోదావరిలో నెలకు రూ.30కోట్లు చెల్లించ డానికి ఒప్పుకుని, అప్పుల పాలై, రైలుపట్టాల కింద తలపెట్టి బలవన్మరణం చెందిన సంగతి తెలిసిందే. ఇలా ఇసుక దోపి డీకి మారుపేరుగా మారిపోయింది. పూర్వం నుంచి ఇసుక తీత మీద ఆధారపడి జీవనం పొందుతున్న బోట్సుమన్ సొసైటీలను మూలకు నెట్టేసి, అక్రమంగా డ్రెడ్జింగ్ చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం-జనసేన- బిజెపి కూటమి అఖండ విజయం సాధించడంతో పాటు వైసీపీ జిల్లాలో మచ్చుకు కూడా కనిపించకుండా పోయిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. ఎన్నికల ముందు ఉచిత ఇసుక విధానం తెస్తానని ఆయన ప్రకటించిన సంగతి తెలిసిందే. అన్నివర్గాలు ఆనందించాయి. భవన నిర్మాణ రంగం, సొంతంగా ఇల్లు కట్టుకునేవారు, అన్నివర్గాలు ఆనందంగా ఉన్నారు. ప్రస్తుతం జిల్లాలోని ఇసుక ర్యాంపులన్నీ ఆగిపోయాయి. దీనితో ఇసుక కొరత ఏర్పడవచ్చు. ఈ నేపథ్యంలో మంగళవారంరాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇసుక విధానం మీద చర్చినట్టు సమాచారం. త్వరలోనే కొత్త ఇసుక విధానం రాబోతుంది.

ఇసుక నిల్వలు అంచనా

ఇంతవరకూ వైసీపీ గూండాగిరికి బెదిరిపోయి, వాళ్లు చెప్పినట్టు వ్యవహరించిన అధికారులు టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చట్టప్రకారం నడుచుకుంటామని చెబుతున్నారు. జిల్లాకు కొత్త కలెక్టర్‌గా చేరిన పి.ప్రశాంతి కూడా గట్టిగా ఉంటూ, ఈ అధికార్లను పరుగులు పెట్టిస్తున్నారు. దీంతో వైసీపీలో కనీసం చట్టం, నిబంధనలు అనే మాట ఎత్తని అధికారులు, చంద్రబాబు సీఎంగానే అందరూ చట్టం జపం చేస్తున్నారు. ఇసుక ర్యాంపులలోకి వెళ్లి, యంత్రా లను సీజ్ చేస్తున్నారు. అంతేకాదు. ప్రస్తుతం జిల్లాలో స్టాక్ పాయింట్లలోనూ, గోదావరి ర్యాంపులలోనూ ఉన్న ఇసుక ఎ న్ని టన్నులు ఉంటుందనే అంచనా వేయడం మొదలు పెట్టారు. సోమవారం లాలాచెరువు, కడియపులంక, కాతేరు వంటి ప్రాంతాలలో లెక్కలువేయగా, మంగళవారం పెరవలి, నిడదవోలు, కొవ్వూరు, తాళ్లపూడి మండలాల్లో పర్యటించి లెక్కలు కట్టడం మొదలుపెట్టారు. బుధవారంనాటికి జిల్లాలో ప్రస్తుతం ఎంత ఇసుక నిల్వలు ఉన్నాయనేది స్పష్టత రానుంది.

● జిల్లాలో ర్యాంపుల వివరాలు

జిల్లాలో 17 ఓపెన్ ర్యాంపులు ఉన్నాయి. సుమారు 32 వరకూ డీసిల్టేషన్ ర్యాంపులు ఉన్నాయి. అవన్నీ ప్రస్తుతం ఆగాయి. కడియం మండలంలో వేమగిరి-కడియంపులంక (బుర్రిలంక), సీతానగరంమండలంలోని వంగలపూడి-1, వంగలపూడి-2, ములకలంక, కాటవరం,పెరవలి మండలంలో ముక్కామల-2, కాకరపర్రు-1, మల్లేశ్వరం, తీపర్రు-2, తీపర్రు-3, పెండ్యాల, కానూరు ర్యాంపులు ఉన్నాయి. నిడదవోలు మండలంలో పందలపర్రు, జీడిగుంట, చిడిపి ర్యాంపులు, కొవ్వూరులో కుమారదేవం-1, కుమారదేవం-2, కుమారదేవం-3, తాళ్లపూడి మండలంలో వేగేశ్వరం ర్యాంపులు ఉన్నాయి. ఇక అఖండ గోదావరి కుడి ఏటిగట్టు వాడపల్లి, ఔరంగాబాద్, ఔరంగాబాద్-2, ఎరినమ్మ, కొవ్వూరు, దొండ గుంట రేవు, అరికిరేవుల-1,2, తాళ్లపూడి, ప్రక్కిలంకతో పాటు మొత్తం 10 డీసిల్టేషన్ ర్యాంపులు ఉన్నాయి. 33 బోట్స్‌మన్ సొసైటీలు ఉన్నాయి. అఖండగోదావరి ఎడమ ఏటిగట్టువైపు మొత్తం 28 డీసిల్టేషన్ ర్యాంపులు. గాయత్రీ -1నుంచి 8, కోటి లి ంగాల 1,3,4,5, కాతేరు 1నుంచి 15ర్యాంపులు, వెంకటనగరం ర్యాంపులు ఉన్నాయి. మొత్తం 97బోట్స్‌మన్ సొసైటీలు ఉన్నాయి.

రీజెన్సీ పరిశ్రమ సమస్యలను పరిష్కరించాలి

- గవర్నర్‌ను కలిసిన ఎండీ జీఎన్‌నాయుడు



గవర్నర్‌తో సీపీ రాధాకృష్ణన్‌తో మాట్లాడుతున్న రీజెన్సీ పరిశ్రమ చైర్మన్ జీఎన్ నాయుడు, ఎండీ సత్యేంద్ర ప్రసాద్

యానాం, జూలై 2: యానాంలో రీజెన్సీ పరిశ్రమకు సంబంధించి ప్రభుత్వ పరిధిలో ఉన్న పెండింగ్ సమస్యలను పరిష్కరించి పరిశ్రమను ఆదుకోవాలని రీజెన్సీ సంస్థల చైర్మన్ డాక్టర్ జీఎన్ నాయుడు, ఎండీ నారా సత్యేంద్రప్రసాద్ కోరారు. హైదరాబాద్ రాజ్‌భవన్‌లో మంగళవారం పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పరిశ్రమ ప్రగతికి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలిచేలా ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకునేలా ఆదేశించాలని, పెండింగ్‌లో ఉన్న రీజెన్సీ సమస్యలను నూటికి నూరుశాతం పరిష్కరించేలా తోడ్పాటు అందించాలని, రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రకటించి పరిశ్రమలను ఆదుకోవాలని జీఎన్ నాయుడు కోరారు. ముందుగా గవర్నర్ రాధాకృష్ణన్‌ను రీజెన్సీ ప్రతినిధులు సత్కరించారు. అనంతరం పరిశ్రమకు సంబంధించిన పలు అంశాలను వివరించారు. ఈఅంశాలపై గవర్నర్ సానుకులంగా స్పందించారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

పింఛన్ల పంపిణీలో రంపచోడవరం టాప్

రంపచోడవరం, జూలై 2: మన్యంలో సామాజిక పింఛన్ల పంపిణీలో రంపచోడవరం మండలం టాప్‌లో నిలిచింది. ఈ వివరాలు ఇలా ఉన్నాయి. రంపచోడవరం మండలంలో మొత్తం 4607 మంది లబ్ధిదారులు ఉండగా 4588 మందికి పింఛన్లు అందచేయడంతో అది 99.58 శాతంగా నమోదైంది. మండలాల వారీగా చూస్తే కూనవరంలో 98.95 శాతం, గంగవరం మండలంలో 98.94 శాతం, వి.ఆర్.పురం మండలంలో 98.56 శాతం, చింతూరు మండలంలో 98.54 శాతం, రాజవొమ్మంగి మండలంలో 98.47 శాతం, అత్యల్పంగా దేవీపట్నం మండలంలో 97.66 శాతంగా నమోదైంది. ఈ పింఛన్ల పంపిణీని టీడీపీ నాయకులు, క్యాడర్ పండగాలా నిర్వహించడంతో కొత్త జోష్ వచ్చింది.

98 శాతం పింఛన్లు పంపిణీ పూర్తి

వై.రామవరం, జూలై 2: మండలంలో ఎన్టీఆర్ భరోసా పథకం పింఛన్లను మంగళవారం నాటికి 98.4శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. మంగళవారం ఆయన మండలంలో పలు పంచాయతీల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీచేశారు. 3,371 పెన్షన్లకు 3317పింఛన్లను ఇచ్చినట్లు తెలిపారు. 98.43శాతం పింఛన్ సొమ్ములను అందజేసినట్లు వివరించారు.

పోలవరం నిర్మాణానికి నిపుణులను రప్పిస్తున్నారు నిర్వాసితుల పరిస్థితి ఏమిటి?


సమావేశంలో మాట్లాడుతున్న మంతెన సీతారాం

వరరామచంద్రాపురం, జూలై 2: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోలవరం ప్రాజెక్టును పరిశీలించడానికి విదేశాల నుంచి నిపుణలను రప్పించి, నివేదిక ఇవ్వాలన్నారు కానీ, నిర్వాసితుల పరిస్థితి ఏమిటని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంతెన సీతారామ్, రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ ప్రశ్నించారు. ఈసందర్భంగా మంగళవారం రేఖపల్లిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులకోసం ఒక్కమాట కూడా మాట్లాడడంలేదని, ఎంతసేపు ప్రాజెక్టు నిర్మాణం కోసం మాట్లాడుతున్నారని వారన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో నిర్వాసితులను నట్టేట ముంచిందని, ఈప్రభుత్వం అయినా నిర్వాసితుల పునరావాసంపై శ్వేతపత్రం ప్రకటించాలన్నారు. గడచిన పదేళ్ల నిర్వాసిత గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని ప్రస్తుత ధరల ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, 18 ఏళ్ల నిండిన ప్రతిఒక్కరినీ పరిగణలోకి తీసుకొని డ్యామ్ నిర్మాణంలో అవకతవకలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, కార్యదర్శి సోయం చినబాబు, సీసం రమేష్, మండల నాయకులు వడ్లాది రమేష్, పులి సంతోష్ కుమార్, పూనెం ప్రదీప్‌కుమార్, కుంజా నాగిరెడి, సుందరయ్య పాల్గొన్నారు.

సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్‌ను కలిసిన 1104 యూనియన్ నాయకులు


సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావును కలిసిన 1104 యూనియన్ నాయకులు

మోతుగూడెం, జూలై2: సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టిన జి.వాసుదేవరావుని 1104 యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పలు సమస్యల లీవ్‌లో వెళ్లివచ్చినప్పుడు రీపోస్టింగ్ ఇవ్వాలని, ఆఫీస్‌లో చేస్తున్న ఓఎం స్టాఫ్‌కి పెయిడ్ హాలీడే ఇవ్వాలని, ఓ అండ్‌ఎం ఉద్యోగులకు డీపీసీ పెట్టి ప్రమోషన్స్ వెంటనే పెట్టమని, కాలనీ వెల్ఫేర్ మీటింగ్ ఏర్పాటు, కల్యాణ మండపానికి కావలసిన వసతుల ఏర్పాటు, క్వార్టర్స్ రిపేరు, వర్షాకాలం వస్తోంది కాబట్టి డ్రింకింగ్ వాటర్, దోమల నివారణ చర్యలు, పవర్‌హౌస్‌లో డ్రింకింగ్ వాటర్, ఫిల్టర్ చేసి ఇవ్వమని పలు సమస్యలను సీఈ వద్ద చర్చించగా ఆయన సానుకూలంగా స్పందించారు. మళ్లీ ఒకసారి చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రీజనల్ సెక్రెటరీ వేమగిరి కిరణ్, 1104 యూనియన్ సీలేరు నాయకులు సతీష్ రాఘవన్, పిలే నాగిరెడ్డి, నాగేశ్వరరావు, పి.పూర్ణిమ, కొట్టు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డొంకరాయి పాఠశాలను సందర్శించిన డీఈవో

మోతుగూడెం, జూలై2: వై.రామవరం మండలం లోని బొడ్డగండి పంచాయతీ డొంకరాయి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ స్కూల్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను డీఈవో బ్రహ్మాజీరావు సందర్శించారు. పాఠశాల రికార్డులను, విద్యార్థుల ప్రతిభాపాఠశాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఈవోతో స్థానిక ఎంపీటీసీ కరకా వెంకటరమణ, భేటీ అయి, డొంకరాయి పాఠశాలల్లో ఉన్న బోధన సిబ్బంది కొరత కోసం వారికి వివరించారు. ఎంపీటీసీ స్వయంగా గ్రామంలో చదువుకున్న వ్యక్తులను ప్రోత్సహించి తాత్కాలిక టీచర్స్‌ని తన సొంత ఖర్చుతో ఏర్పాటుచేసి పిల్లల విద్యకు ఆట ంకం రాకుండా స్కూల్‌ని నడిపిస్తున్న విధానాన్ని వివరించి, త్వరితగతిన డిప్యూటేషన్ మీద అయినా సరే బోధన సిబ్బందిని పంపి లోటుని భర్తీ చేయాలని కోరారు. అందుకు డీఈవో కూడా సానుకూలంగా స్పందించి, ఎంపీటీసీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్, టీచర్ చినరాజయ్య, పాల్గొన్నారు.

'వరదలు వస్తే ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం'

కూనవరం, జూలై 2: వరదలు ఎప్పుడు వచ్చిన ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని తహసీల్దార్ మురళీకృష్ణ అన్నారు. వరద సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వరుసగా వరదలు వస్తున్నాయని అధికారులు ప్రతీసారి విఫలమవుతున్నారని స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పేర్కొన్నారు. ముఖ్యంగా వరద పెరిగే సమయంలో అధికారులకు బోట్లపై నియంత్రణ ఉండడంలేదన్నారు. కొంతమంది ప్రైవేట్ బోట్ యజమానులు ప్రజలను దాటవేయడానికి గుట్టుచప్పుడు కాకుండా వేలల్లో డబ్బులు తీసుకుంటున్నారన్నారు. అన్ని గ్రామాల్లో బఫర్ స్టాక్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హేమంత్, పొడియం అప్పా రావు, వైస్ ఎంపీపీ బండారు సాంబశివరావు, నోముల సత్యనారాయణ, చెలకాని ఉమామహేశ్వరరావు, గడ్డిపాటి ప్రసాద్, గుజ్జా మోహనరావు పాల్గొన్నారు.

'ప్రభుత్వం బాగా పనిచేయాలి'

కూనవరం, జూలై2: ఏప్రభుత్వమొచ్చిన స్థానిక ముంపు మండలాల ప్రజలకు పరిహారం ఇచ్చిన వారినే నిర్వాసితులు దేవుడిగా కొలుస్తారని వారినే అభిమానమిస్తారని చిన ఆర్కూర్ వైసీపీ సర్పంచ్ సున్నం అభిరాం అన్నారు. స్థానిక సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు తక్షణమే ఇక్కడ పరిహారం ఇవ్వాలన్నారు. గోదావరిని దృష్టిలో పెట్టుకుని అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేయాలన్నారు. గత ప్రభుత్వం కంటే ఈప్రభుత్వం మెరుగుగా పనిచేయాలని అభిరాం తెలిపారు.

గత ప్రభుత్వం వల్లే పాఠశాలకు ఈ దుస్థితి


వర్షం కురుస్తుండడంతో పాఠశాలలో గిన్నె పెట్టిన దృశ్యం

కూనవరం, జూలై 2: గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంవల్లే ముంపు మండలాల పాఠశాలలు అధ్వానంగా తయారయ్యాయని టీడీపీ నాయకులు సోమక సత్యనారాయణ అన్నారు. వర్షం వస్తే కూనవరం మండలంలో 80 శాతం పాఠశాలల్లోకి నీరు చేరుతుందన్నారు. చదువు చెప్పాలంటే ఉపాధ్యాయులకు, కూర్చునేందుకు విద్యార్థులకు ఇబ్బందిగా ఉందన్నారు. నూతన ప్రభుత్వంలో మంచిరోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో తుంగల కన్నారావు, సేలం కన్నయ్య, సత్యనారాయణ, తుంగల శ్రీనివాసరావు, సత్యం పాల్గొన్నారు.

రైతులకు ఉచితంగా వరి వంగడాలు పంపిణీ

ఎటపాక, జూలై2: జగదాంబ త్రిశక్తి పీఠాధిపతి తాళ్లూరి బెనారస్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు ఉచిత వరి వంగడాలను పంపిణీ చేశారు. చోడవరం, పాండురంగాపురం, చిన్న నల్లకుంట గ్రామాలకు చెందిన సుమారు 40 మంది రైతులకు 20బస్తాల వరి వంగడాలను అందజేశారు. ఎటపాక సీఐ డి.రామారావు రైతులకు విత్తనాలను అందించారు. రైతులకు ఉచితంగా వరి విత్తనాలు అందించటంలో కృషి చేసిన టీడీపీ ఎటపాక మండల క్లస్టర్ ఇంచార్జ్ మాచినేని రాజేష్‌ను సీఐ అభినందించారు. ఈకార్యక్రమంలో కరి రమేష్, మాచినేని శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడి కల్యాణోత్సవం

కోరుకొండ, జూలై 2: మండలంలోని పశ్చిమగోనగూడెం గీతా మిషన్ వద్ద రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి వార్షిక కల్యాణోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామికి విశేషపంచామృత అభిషేకాలు జరిపారు. భగవద్గీతలోని 18 అధ్యాయాలు పారాయణం చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా స్వామి కల్యాణం జరిగింది. కార్యక్రమంలో కట్టా రాజబాబు, బొమ్ముల గంగరాజు, బొమ్ముల వీరబాబు, ఇరగవరపు రామాచార్యులు, ఎస్ఎస్‌వీ ఆదినారాయణ, ఎస్‌వీఎస్‌ప్రసాద్ దంపతులు కల్యాణం నిర్వహించారు.

వలంటీర్లు లేకుండానే పింఛన్ల పంపిణీ

» ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి


రామవరం సమావేశంలో పింఛన్లు అందుకున్న వైసీపీ నాయకుల ఫొటోలు చూపుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జూలై 2: ఒక్క రోజులోనే రాష్ట్రంలో దాదాపుగా 98శాతం పింఛన్ల పంపిణీని వలంటీర్లు లేకుండానే పంపిణీ చేసిన ఘనత ఎన్డీయే ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం రామవరంలో ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వలంటీర్లు లేకుండా పింఛన్ల పంపిణీ జరగదంటూ జగన్ అండ్‌కో, సీఎస్ జవహర్‌రెడ్డి అవ్వతాతల ప్రాణాలతో చెలగాటమాడారన్నారు. మూడు నెలల పాటు ఇబ్బందులకు గురిచేసి అనేక మంది ప్రాణాలు పొట్టన పెట్టుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఒక్క రోజులో అధికారులతో కలిసి కార్యకర్తలు 98శాతం పంపిణీ పూర్తి చేశారని అన్నారు. అలాగే ఐదేళ్లలో వైసీపీ నాయకులుగా ఉంటూ టీడీపీ నాయకులపై విషం చిమ్మిన బలభద్రపురంలో వడ్డీలరెడ్డి, రామవరంలో మాజీ సర్పంచ్ భర్త గోవిందరెడ్డి సహా అనేక మంది పింఛన్లు అందుకున్నారని వారి ఫొటోలను చూపుతూ వివరించారు.

అభిమానుల మొక్కులు చెల్లించిన ఎమ్మెల్యే దంపతులు

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అనపర్తిలో కూటమి అభ్యర్థిత్వం ఖరారు కావాలని అభిమానులు మొక్కిన మొక్కులను మంగళవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు చెల్లించుకున్నారు. టీచర్ నాగమణి మొక్కు మేరకు అనపర్తి జనార్దనస్వామి ఆలయంలో సత్యనారాయణ మూర్తి వ్రతమాచరించి మొక్కును చెల్లించారు. ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో చైర్మన్ పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి మొక్కును చెల్లిస్తూ పూజల్లో పాల్గొన్నారు. కెనాల్ రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో వంగా శివయ్య, చింతా వీర్రాఘవరెడ్డి మొక్కుకున్న 216 కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం వీర్రాజు మామిడి వద్ద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నల్లమిల్లి దంపతులు అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వోగిరెడ్డి సత్తిరెడ్డి మొక్కును చెల్లిస్తూ ఎమ్మెల్యేకు పటికబెల్లంతో తులాభారం నిర్వహించారు. కార్యక్రమాల్లో తమలంపూడి సుధాకరరెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం అందజేత

బిక్కవోలు, జూలై 2: ఈనెల 29న బిక్కవోలులో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఊలపల్లికి చెందిన గొర్త చిన్న కుటుంబ సభ్యులను సోమవారం రాత్రి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఏపీఈపీడీసీఎల్ బిక్కవోలు సబ్‌డివిజన్ ఉద్యోగుల సౌజన్యంతో సేకరించిన రూ.5 లక్షలను చిన్న భార్య సత్యకుమారికి అందజేసి ఉద్యోగులను అభినందించారు. కార్యక్రమంలో తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, సత్తి దేవానందరెడ్డి, కాకర్ల అశోక్, ఏడీఏ నిరంజన్, ఏఈ బుజ్జిదొర పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపిన 'కూటమి'

» ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి


కలెక్టర్ ప్రశాంతికి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ, జూలై 2: కూటమి ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగులు నింపిందని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రం సమీపంలోని అంబేడ్కర్ భవనంలో వీహెచ్‌పీఎస్ ఏపీ డీహెచ్‌ఎస్ఎస్, టీడీపీ దివ్యాంగ సంఘాల ఆధ్వర్యంలో పింఛన్లు పెంచి అమలు చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. దీనికి గోరంట్ల ముఖ్యఅతిథిగా హాజరై సత్కరించారు.కార్యక్రమంలో రాష్ట్ర అధ్య క్షుడు ఎనుములు వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు గంగరాజు, టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మార్ని వాసుదేవరావు, మహిళా అధ్యక్షురాలు ఎర్ర ఉమామహేశ్వరి, నారాయణ వీర రాఘవమ్మ ,పెండం గాంధీ, రాష్ట్ర దివ్యాంగులు సంఘం అధ్యక్షుడు ఎనమదల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, జూలై 2: ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మంగళవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయానికి వెళ్లిన గోరంట్ల కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా కేవీకే స్వర్ణోత్సవ జ్యోతి ప్రయాణం


స్వర్ణోత్సవ జ్యోతిని స్వీకరిస్తున్న కలవచర్ల కేవీకే అధికారులు

రాజానగరం, జూలై: కృషి విజ్ఞాన కేంద్రాల(కేవీకే) స్వర్ణోత్సవ జ్యోతి ప్రయాణం కార్యక్రమాన్ని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం కొండెంపూడి, విశాఖపట్నం నుంచి ఈ స్వర్ణోత్సవ జ్యోతిని (ఐకార్-సీటీఆర్ఐ) మాగంటి శేషుమాధవ్ సోమవారం స్వీకరించారన్నారు. తొలుత 1974 మార్చి 21న స్థాపించిన పుదుచ్చేరి కృషి విజ్ఞాన కేంద్రంతో సహా దేశంలోని 731 కేంద్రాలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నట్టు చెప్పారు. భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐకార్), సీటీఆర్ఐ ఆధ్వర్యంలో 1983లో కలవచర్లలో స్థాపించబడిన కేవీకే రైతు సేవల్లో నాలుగు దశాబ్దాలుగా నిర్వచనీయమైన కృషి చేస్తూ వ్యవసాయ, వ్యవసాయేతర, అనుబంధ రంగాల్లో సూచనలు, సలహాలు అందిస్తూ జాతీయ స్థాయి గుర్తింపు పొందిందన్నారు. డాక్టర్ వైఎస్సార్ హెచ్‌యూ కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ లలితకామేశ్వరి, పందిరిమామిడి కేవీకే వారు ఈ స్వర్ణోత్సవ జ్యోతిని కలవచర్ల హెడ్ నుంచి అందుకున్నారు. తదుపరి కార్యక్రమాన్ని బుధవారం పందిరిమామిడి నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా రెండు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. సాయిల్ హెల్త్ కార్డులు, ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన కార్యక్రమానికి ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ వై.జ్యోతిర్మయి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ జయరాంలక్ష్మి,జిల్లా రీసోర్స్ సెంటర్ వీరవెంకటరావు, ఏపీసీఎన్ఎఫ్ సభ్యులు, గ్రామీణ ఎన్జీవో అధికారులు పాల్గొని రైతు మహిళలకు భూసారాన్ని పెంపొందించే దిశగా పచ్చిరొట్టల పెంపకం, మట్టి నమూనాలు సేకరణ, విశ్లేషణ, తదనుగుణంగా ఎరువుల సిఫారసు, దిగుబడులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జేవీఆర్ సత్యవాణి, రఘునందన్, సంజయ్ హెగ్డే, బి.నాగేశ్వరరెడ్డి, రవీంద్ర, ఆర్.రత్నాజీ, టి.విజయవర్ధన్, జె.ప్రభాత్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడండి

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్


చిన్నారులకు జింక్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 2 : రాజమహేంద్రవరం నగరంలో ఒక్క డయేరియా కేసు కూడా నమోదు కాకుండా వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం కోటిలింగాలరేవు పరిసర ప్రాంతాలను మంగళవారం ఎమ్మెల్యే శ్రీనివాస్ ప్రజాప్రతినిధులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందితో కలసి పరిశీలించి మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ ప్రసన్నలక్ష్మి, నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ వినూత్న, హెల్త్ సూపర్‌వైజర్ విజయకుమారి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వివరాలను కంప్యూటరైజ్ చేసుకోవాలి

రంగంపేట, జూలై 2: రంగంపేట వ్యవసాయ సొసైటీ పరిధిలోని సభ్యులందరూ తమ రికార్డుల వివరాలను కంప్యూటరైజేషన్ చేయించుకోవాలని సీఈవో బొడ్డు త్రిమూర్తులు మంగళవారం తెలిపారు. సొసైటీలో సభ్యులుగా ఉన్న రంగంపేట, వడిశలేరు, పెదరాయవరం,చంద్రేడు, కోటపాడు, రామేశంపేట,వెంకటాపురం, ముకుందవరం, సుభద్రంపేట గ్రామాల రైతులు తమ ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌బుక్ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు, ఫోన్ నెంబర్‌ను ఈ నెల 4వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఇచ్చి సొసైటీలో కంప్యూటరైజేషన్‌కు సహకరించాలని ఆయన కోరారు.

కడియం: కడియం, కడియపులంక, వేమగిరి సొసైటీల్లో సభ్యత్వం ఉన్న వారి ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరు, నామినీ వివరాలు, సంఘంలో ఇచ్చి కంప్యూటరీకరణ చేయించుకోవాలని ఆయా సంఘాల కార్యదర్శులు ఓ ప్రకటనలో తెలిపారు. కడియం 93930 95973, వేమగిరి 83338 98823, కడియపులంక 93987 82706 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఆసుపత్రికి వెళ్లి రోగికి పింఛను అందజేత

రాజమహేంద్రవరం సిటీ, జూలై 2 : రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా కూటమి ప్రభుత్వం పెంచిన పింఛను పంపిణీ చేపట్టింది. అయితే రాజమహేంద్రవరం ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన పి.రాంబాబు కేన్సర్‌తో జీఎస్ఎల్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నాడు. ఈ నేపథ్యంలో రాంబాబు ఎక్కడ ఉన్నాడని సచివాలయ సిబ్బంది డివి రత్నకుమారి ఆరా తీశారు. విషయం తెలియడంతో జీఎస్ఎల్ ఆసుపత్రికి వెళ్లి రాంబాబుకు పింఛను అందించారు.

మామిడి మొక్క నాటిన బీజేపీ నాయకుడు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 2 : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అడబాల రామకృష్ణారావు స్థానిక 12వ డివిజన్‌లోని తన నివాస ప్రాంతంలో మామిడిమొక్కను నాటారు. ఆ మొక్కకు తన మాతృమూర్తి అడబాల నారాయణమ్మ పేరు పెట్టారు.

ఆటోలో ఆర్మీ ఉద్యోగి నగదు చోరీ

రాజమహేంద్రవరం, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఆర్మీ ఉద్యోగి నగదు చోరీ జరగడంపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసరావు వివరాల ప్రకారం.. నగరంలోని ఆల్‌కట్ గార్డెన్స్ భారతీ వీధికి చెందిన మేజర్ జయశ్రీ మర్రి నాగ్‌పూర్‌లోని మిలటరీ మెడికల్ సర్వీసెస్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె సెలవుపై రాజమహేంద్రవరంలోని తన ఇంటికి వచ్చారు. హ్యాండ్ బ్యాగులో రూ.20 వేలతో ఆటో ఎక్కి రూ.6 వేలతో ఆల్‌కట్ గార్డెన్స్‌లో కావాల్సిన సరుకులు కొనుక్కున్నారు. మిగతా రూ.14వేలతో మరో ఆటోలో ప్రయాణించి సుమారు 100మీటర్ల దూరంలోని ఇంటి వద్ద దిగారు. అయితే, ఇంట్లోకి వెళ్లి బ్యాగ్‌లో చూసుకోగా డబ్బులు లేవని, మార్గమధ్యలో రైల్వే స్టేషను వద్ద నలుగురు మహిళలు చంటి పిల్లాడితో ఆటో ఎక్కారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ముంపు బాధితులను ఆదుకుంటాం

ఎమ్మెల్యే బత్తుల సతీమణి వెంకటలక్ష్మి


శ్రీరంగపట్నంలో ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న వెంకటలక్ష్మి

కోరుకొండ, జూలై 2: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఏజెన్సీ ప్రాంతం నుంచి శ్రీరంగపట్నం చెరువుకు భారీగా నీరు చేరడం, చెరువుకు గండి పడటంతో గ్రామంలోని లోతట్టు ప్రాంతాలు, పంట పొలాల్లోకి వరద నీరు చేరింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సతీమణి వెంకటలక్ష్మి హుటాహుటిన శ్రీరంగపట్నం చేరుకుని వరద ప్రాంతాన్ని పరిశీలించారు. బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని ధైర్యం చెప్పారు. అనంతరం ఆమె సర్పంచ్, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి తక్షణమే ఇసుకబస్తాలతో గండిపూడ్చే పనులు ప్రారంభించి దగ్గరుండి పూర్తి చేయించారు. అలాగే గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌ను ఆమె సందర్శించారు. తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు పరిశీలించారు. తరగతి గదుల మరమ్మతులపై ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులతో చర్చించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దాల పెదఅమ్మాజీ, మద్దాల రమణ, దేవన దుర్గాప్రసాద్, యర్రంశెట్టి పోలారావు పాల్గొన్నారు.

సువర్ణమాల సేవలు అభినందనీయం



కడియం, జూలై 2: సువర్ణమాల సేవలు అభినందనీయం అని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ అన్నారు. ఏఎన్ఎంగా సుదీర్ఘకాలం ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి మంగళవారం పదవీ విరమణ చేసిన కొంబత్తుల సువర్ణమాలను కడియపులంక పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్-ఇన్‌చార్జి పాటంశెట్టి రాంజీ, దవళేశ్వరం పీహెచ్‌సీ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్, వైస్ ఎంపీపీ పంతం గణపతి, బోడపాటి రాజేశ్వరి, చెల్లుబోయిన రామకృష్ణ, గట్టి చంద్రావతి, కట్టా శివ, డాక్టర్లు జెస్సీసుప్రియ, జి.స్వరూప, ఎం.మణిజ్యోత్స్న, ఎన్.నాగసాయిమౌర్య, ఆరోగ్య విస్తరణాధికారులు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్‌ను తనిఖీ చేసిన ఆర్డీవో


లిటిల్ ప్యారడైజ్ స్కూల్ తనిఖీ చేస్తున్న ఆర్డీవో

రాజమహేంద్రవరం సిటీ, జూలై 2: రాజమహేంద్రవరంలో ప్రైవేట్ విద్యా సంస్థలో ఉచిత సీటు పొందిన విద్యా ర్థుల పట్ల ఆయా పాఠశాలలో అనుసరిస్తున్న తీరు దారుణంగా ఉందని తల్లిదండ్రులు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదుపై 24 గంటల్లో స్పందన వచ్చింది. కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు ఆర్డీవో చైత్రవర్షిణి మంగళవారం రాజమహేంద్రవరంలో లిటిల్ ప్యారడైజ్ స్కూల్‌ను తనిఖీ చేశారు. అక్కడ చిన్నారులతో చైత్రవర్షిణి మాట్లాడారు. ఉచిత సీట్లు ఇచ్చిన చిన్నారులకు ఇతర పిల్లలతో సమానంగా విద్యాబోధన చేయాలని స్పష్టం చేశారు.

కోటిలింగాల కైలాస భూమిలో మాజీ మంత్రి వేణు తల్లి అంత్యక్రియలు



రాజమహేంద్రవరం సిటీ, జూలై 2: రాష్ట్ర మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ మాతృమూర్తి సుభద్రమ్మ (94) రామచంద్రపురంలో సోమవారం మరణించారు. ఆమె చివరి కోరిక మేరకు మంగళవారం రాజమహేంద్రవరం కోటిలింగాల కైలాస భూమిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా కైలాస భూమి వద్ద సుభద్రమ్మ పార్థివ దేహానికి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ ,మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, రౌతు సూర్యప్రకాశరావు నివాళులర్పించారు. మాజీ మంత్రి వేణును కలిసి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

టీచ్‌టూల్ ఉపాధ్యాయ శిక్షణ


కార్యక్రమంలో మాట్లాడుతున్న సమగ్రశిక్షా ఏపీసీఎస్ సుభాషిణి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 2: రాజమహేంద్రవరం డీఎం హెచ్ స్కూల్ లో జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణ తరగతులను జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్.సుభాషిణి పరిశీలించారు. మంగళవారం పాఠశాలకు వచ్చిన ఆమె మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలు తరగతి స్థాయికి చేరేలా చూడాలన్నారు. విద్యలో ఉత్తమ ప్రమాణాలు సాధించాలంటే బోధనలో మెలకువలు నేర్చుకోవాలని మారుతున్న విధానాలకు అనుగుణంగా బోధనా నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ రేంజ్ డీఐ,కోర్స్ కోఆర్డినేటర్ బి.దిలీప్ కుమార్, విషయనిపుణులు ఎన్.శ్రీనివాస్, ప్రవీణ్, శిరీష్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన


రంగంపేట, జూలై 2: రంగంపేట జడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలను మంగళవారం కూటమి నాయకులు పరిశీలించారు. విద్యార్థులకు ఇస్కాన్ సౌజన్యంతో రాగిజావ, పులిహోర, దొండకాయ పచ్చడి ఆహారంగా అందించారు. కార్యక్రమంలో యలమాటి రాంబాబు, పోతుల చిన్నికాపు, మండవిల్లి గుప్త, గుండుబిల్లి వరప్రసాద్, ఉంవిల్లి శివప్రసాద్, పసల వికాస్, బొల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బీమా ఉద్యోగుల సంఘం ఆవిర్భావ దినోత్సవం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 2: రాజమహేంద్రవరం ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం అఖిల భారత బీమా ఉద్యోగులసంఘం 74వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. యూనియన్ పతాకాన్ని అధ్యక్షుడు గుబ్బల రాంబాబు ఆవిష్కరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ మాట్లాడుతూ ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ అభివృద్ధికి ఉద్యోగులు ఎల్లప్పుడూ ముందుంటారన్నారు. కార్యక్రమంలో ఈశ్వరరావు, భరణి, సత్యదేవ, మాథ్యూస్, జి.శ్రీనివాస్, శిరీష, రాజ్యం, రమణ, దుర్గ, గనెయ్య, విశ్వనాథ్, బాలు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ విజయవంతం

రంగంపేట, జూలై 2: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమం మండలంలో విజయవంతంగా జరిగిందని ఇన్‌చార్జ్ ఎంపీడీవో పి.వెంకటరత్నం మంగళవారం తెలిపారు. మండలంలో 9035 మంది లబ్ధిదారులకు గాను రూ.6,00,83,000 మంజూరయ్యాయని, అందులో 893 పింఛన్లు గాను రూ.6,01,47,500(98.87శాతం) ఆర్థిక లబ్ధిని సచివాయ సిబ్బంది, ఇతర ఉద్యోగుల ద్వారా ఇంటింటికి పంపిణీ చేశామన్నారు. లబ్ధిదారుల్లో 64 మంది మరణించారనిని, మంది గ్రామాంతరం అనగా వేరే ప్రాంతంలలో ఉన్నారని ఎంపీడీవో వెంకటరత్నం తెలిపారు.





అభివృద్ధి జరగాలి : కాకినాడ కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పవన్..పవర్

4 గంటల పాటు ఏకధాటిగా సాగిన సమీక్షలు

- అన్ని వ్యవస్థలను గాడిలో పెడతాం
- ఐదేళ్లలో రూ.5 వేల కోట్ల ఇసుక రాబడి
- స్థానిక సంస్థలకు సీనరేజీ ఎగవేత
- పంచాయతీ నిధులు మింగేసిన జగన్
- జలజీవన్ మిషన్ నిధులతో గ్రామాలకు నీళ్లు
- హోప్ ఐలాండ్ ఎకో టూరిజం పార్కుగా అభివృద్ధి
- ఉప్పాడ సముద్ర కోత పరిశీలనకు నేడు నిపుణులు
- కాకినాడ జిల్లాలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

కాకినాడ (కలెక్టరేట్), జూలై 2: కేంద్రం ఇస్తున్న జలజీవన్ మిషన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకుని అన్ని గ్రామాలకు రక్షిత తాగునీరందిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్ చెప్పారు. జనావాసాల్లో ఉన్న తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని చెప్పారు. కాకినాడ కలెక్టరేట్ వివేకానంద సమావేశ మందిరంలో మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, అటవీ శాఖ, పర్యావరణశాఖలపై అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. నాలుగు గంటల పాటు జరిగిన సమీక్షల్లో అన్ని అంశాలపై వివరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ 'గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఏడాదికి వెయ్యి కోట్ల ఇసుక వ్యాపారం జరిగింది. ఐదేళ్లలో రూ.5 వేల కోట్ల రాబడి వచ్చినా జగన్ ప్రభుత్వం మాత్రం పంచాయతీల నిధులకు గండి కొట్టింది. గనుల సీనరేజీ నిధులు సైతం ఇవ్వకుండా దారి మళ్లించారు. వీటన్నింటిపై అధికారులను నివేదిక కోరినట్టు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చెప్పారు. గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వుకుని పంచాయ తీలకు చిల్లిగవ్వ కూడా పన్ను చెల్లించలేదన్నారు. ఈ పరిస్థితిని మార్చి ఉమ్మడి జిల్లాలో అన్ని పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి కలిగేలా చేస్తామన్నారు. కాకినాడకు అతి సమీపంలో ఉన్న కోరంగి మడ అడవులను గత వైసీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాల పేరుతో ధ్వంసం చేసింది. వేల టన్నుల కంకరతో మడ భూములను చదునుచేసింది. దీనివల్ల మడ అడవుల్లో ఉండే జీవరాశులు మనుగడ కోల్పోయే ప్రమాదం వాటిల్లిందన్నారు. తిరిగి మడ అడవుల అభివృద్ధికి చర్యలు తీసుకునేలా అధికారులకు ఆదేశాలు జారీచేసినట్టు చెప్పారు. కోరంగిలో ఎకో టూరిజం అభివృద్ధి చేస్తామన్నారు.ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కాకినాడ సముద్ర తీరంలో ఉన్న హోప్ ఐలాండ్‌ను సంరక్షిస్తామని, అక్కడున్న జీవులను కాపాడేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. కాకినాడ స్మార్ట్ సిటీకి సంబంధించి రావాల్సిన నిధులు, అభివృద్ధి పనుల విషయంపై ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ కేంద్రంతో మాట్లాడతారని తెలిపారు. ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామని చెప్పారు. సముద్రతీరాన్ని రక్షించే మడ అడవులను వైసీపీ పాలనలో నాశనం చేసి ఇళ్ల పట్టాలు ఇచ్చారని తెలిపారు. హానికరమైన మలేషియన్ బ్రీడ్ రకం కోనో కార్పస్ మొక్కలను పచ్చదనం కోసం పెంచారని, వాటిని దశలవారీగా తొలగిస్తామని చెప్పారు. ఉప్పాడ తీర ప్రాంతంలో సముద్రపు కోత వల్ల తీవ్ర నష్టం జరుగుతోందని, దాని పరిశీలనకు తాను బుధవారం వెళ్లనున్నట్టు తెలిపారు. చెన్నైకు చెందిన నిపుణుల బృందం పరిశీలనకు వస్తున్నట్టు చెప్పారు. వనాలు, జీవజాతుల పరిరక్షణలో ప్రజలను భాగస్వాములు చేయాలని సూచించారు. వ్యవస్థలను అన్నింటినీ గాడిలో పెడతామని తెలిపారు. సమావేశంలో కాకినాడ జిల్లా కలెక్టరు సగిలి షాన్‌మోహన్, జేసీ రామసుందరరెడ్డి, ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ, నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎస్పీ సతీష్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉప్పాడ తీరం ధ్వంసం కాకుండా చర్యలు

ఉప్పాడ తీరంలో ఏడాదిన్నర కాలంగా ఎకరం భూభాగం సముద్రపు కోతలో కలిసిపోయిందని. ఇలా ధ్వంసం కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. బుధవారం చెన్నై నుంచి వచ్చే నిపుణుల బృందం ఉప్పాడ తీరాన్ని పరిశీలించి దాన్ని రక్షణకు అవసరమైన చర్యలు సూచిస్తుందన్నారు. తద్వారా తీర సంరక్షణ చేపడుతున్నట్టు చెప్పారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. కేరళలో అధ్యయనం చేసిన తర్వాత కోనసీమలో కొబ్బరి ఉత్పత్తులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధుల సాయంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సైన్సు అండ్ టెక్నాలజీని అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే నన్నయ్య యూనివర్సిటీలో ఉన్న రీసెర్చ్ స్కాలర్లను తీసుకెళ్లి ఉప్పాడ తీర సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేస్తామని చెప్పారు.



అధికారులతో సమీక్షిస్తున్న పవన్ కల్యాణ్ చిత్రంలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యేలు నెహ్రూ,కొండబాబు, నానాజీ, సత్యప్రభ

నేడు పిఠాపురంలో పవన్ వారాహి సభ

పిఠాపురం/ఉప్పాడ, జూలై 2: పవన్‌కల్యాణ్ మూడో రోజు గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని తన నివాసం నుంచి బుధవారం ఉదయం 10 గంటలకు బయలుదేరి కొత్తపల్లి మండలం ఉప్పాడ చేరుకోనున్నారు. ఉదయం 10.45 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సముద్రపు కోత ప్రాంతాలను పరిశీలించి మత్స్యకారులతో మాట్లాడతారు. అక్కడ నుంచి 12 గంటలకు బయలుదేరి చేబ్రోలు నివాసానికి 12.45 గంటలకు చేరుకుంటారు. చేబ్రోలు నివాసంలో పిఠాపురం నియోజకవర్గానికి చెందిన అన్ని శాఖల అధికారులతో సమావేశమవుతారు. అనంతరం టీడీపీ, బీజేపీ ముఖ్య నేతలను కలుసుకుంటారు.భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరి సాయంత్రం 4 గంటలకు పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్‌కు చేరుకుంటారు. అక్కడ జరిగే వారాహి బహిరంగ సభలో పాల్గొని తనను గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రసంగిస్తారు. సభ అనంతరం సాయంత్రం ఆరు గంటలకు బయలుదేరి విజయవాడ వెళతారు.

పనులపై నివేదిక ఇవ్వండి

పంచాయతీరాజ్‌పై సమీక్ష సందర్భంగా జిల్లా, మండల పరిషత్ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనుల గురించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామచంద్రమూర్తి వివరించారు. దీనిపై పవన్ స్పందిస్తూ ఈ పనులు జిల్లా అంతటా జరిగాయా, లేక కొన్ని మండలాల్లోనే జరిగాయా అన్న విషయంపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలో 1 జడ్పీటీసీ, 13 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉందని జిల్లా కలెక్టరు సగిలి షాన్‌మోహన్ తెలిపారు. జిల్లాలోని మునిసిపాలిటీల్లో విలీనానికి ప్రతిపాదించిన 10 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగలేదని చెప్పారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 12 నియోజకవర్గాల పరిధిలోని 32 మండలాలకు నీరందించేందుకు రూ.1650 కోట్లతో జలజీవన్‌మిషన్ కింద ప్రతిపాదించిన వాటర్‌గ్రిడ్ పథకం హెడ్‌వర్క్స్‌కు అవసరమైన 14 ఎకరాల భూసేకరణ పూర్తికాక పనులు ముందుకు సాగలేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ తెలిపారు. పిఠాపురం-రాపర్తి మధ్య హైవే పనుల వల్ల సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌కు చెందిన పైపులైన్లు దెబ్బతినడంతో 17 ఆవాస ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎస్ఈ వివరించారు. నాగులాపల్లి స్కీమ్ ఇబ్బందులను తెలియజేశారు.

మా గుర్తుగా..



పవన్‌కల్యాణ్‌ను సత్కరించి ఫొటోలతో కూడిన జ్ఞాపిక అందజేస్తున్న చేబ్రోలులో పవన్ నివాసం ఉంటున్న ఇంటి యజమాని ఓదూరి నాగేశ్వరరావు కుటుంబీకులు

కాలుష్యకారక పరిశ్రమలపై చర్యలు

కాలుష్యంతో పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్న పరిశ్రమలపై కఠినంగా వ్యవహరిస్తామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. కాలుష్య నివారణ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వీరభద్ర ఎక్స్‌పోర్ట్స్ సంస్థపై తీసుకున్న చర్యలను తెలియజేయాలని పీసీబీ ఈఈ సందీప్‌రెడ్డిని ఆదేశించారు. శాస్త్ర సాంకేతిక శాఖకు సంబంధించి రాజమహేంద్రవరంలో ఏర్పాటుచేస్తున్న కేంద్రాన్ని త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. విద్యార్థుల్లో సాంకేతికపై ఆసక్తి కలిగేలా కేంద్రాన్ని తీర్చిదిద్దాలన్నారు.

పర్యాటక ప్రాజెక్టును కోరాం

కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాకు ప్రసాద్ పథకం కింద పర్యాటక ప్రాజెక్టు, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏర్పాటుకు ప్రధానమంత్రి మోదీని కోరామని తెలిపారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) మాట్లాడుతూ ఆగిపోయిన స్మార్ట్‌సిటీ పనులు తిరిగి ప్రారంభించాలని కోరారు. నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి గతంలో ఏటిమొగ వద్ద ఉప్పుటేరుపై శంకుస్థాపన చేసిన బ్రిడ్జి పనులు తిరిగి ప్రారంభించాలని కోరారు.

ఆనందం.. కనిపించను!



రెండో రోజుకే 99.06 శాతం పంపిణీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అనుకుంటే సాధ్యం కానిది ఏదీ లేదని నిరూపించారు.. వలంటీర్లు లేరు.. పింఛన్ల పంపిణీపై సరైన అవగాహనలేదు.. అయినా లక్ష్యంపై నూరేశారు. జిల్లాలో కేవలం రెండు రోజుల్లో 99.06 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. అందుబాటులో లేనివారు, ఇతర రాష్ట్రాలకు వెళ్లిన వారుతప్ప మిగతా వారందరికీ పింఛన్లు అందినట్టే. ఎక్కడెక్కడో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి సమాచారం తెలుసుకుని అక్కడకు వెళ్లి పింఛన్లు అందజేశారు. సచివాలయ ఉద్యోగులు ఎక్కడా వెనుకడుగు వేయలేదు. నూరుశాతం పూర్తి చేశారు.. శెహబాస్ అనిపించుకుంటున్నారు. జిల్లాలో మొదటిరోజు 96.31 శాతం పింఛన్లు పంపిణీ చేయగా..రెండోరోజు మంగళవారం మొత్తం 99.06 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి మంగళవారం తెలిపారు. వైసీపీ హయాంలో జిల్లాలో 9148మంది వలంటీర్లు ప్రతీ నెలా 1నుంచి 5వతేదీ వరకూ పెన్షన్లు పంచేవారు. ఇవాళ కేవలం 4092మంది సచివాలయ, ఇతర ఉద్యోగులు కలసి మొదటి ఒక్కరోజే 96శాతం పూర్తి చేగా, రెండోరోజు మంగళవారం నాటికి 99.06శాతానికి పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 241771 మంది లబ్దిదార్లు ఉండగా, 23948మందికి పంపిణీ చేశారు. కేవలం 2284మంది మిగిలారు. వీరిలో చాలా మంది ఇతర ప్రాంతాలలో ఉన్నవారు ఉంటారు. వృద్ధులు చనిపోయిన వారు కూడా ఉండవచ్చు. ఇక మొత్తం జిల్లాలో రూ.163,36,12,500 పంపిణీ లక్ష్యం కాగా, రూ.161,81,12,500 పంపిణీ చేశారు. ఇక కేవలం రూ. కోటి 55 లక్షలు మిగిలింది.

మండలాల వారీగా ఇలా..

మండలం	పింఛన్‌దారులు	పంపిణీ
అనపర్తి	10,439	10,322
బిక్కవోలు	10786	10,686
రంగంపేట	9035	8,935
దేవరపల్లి	11,171	11,068
గోపాలపురం	9238	9,170
నల్లజర్ల	11,649	11,561
గోకవరం	10,701	10,612
చాగల్లు	9503	9,436
కొవ్వూరు	10,257	10,199
కొవ్వూరు(మున్సిపాల్టీ)	4015	3,982
తాళ్లపూడి	7941	7,868
నిడదవోలు	10,551	10,465
నిడదవోలు(మున్సిపాల్టీ)	4334	4,301
పెరవలి	10,420	10,319
ఉండ్రాజవరం	10,512	10,413
కడియం	12,144	11,997
కోరుకొండ	12,474	12,368
రాజానగరం	15,564	15,422
సీతానగరం	11,739	11,633
రాజమండ్రి (అర్బన్)	29,436	29,126
రాజమండ్రి(రూరల్)	19,862	19,604



నిడదవోలు : నిడదవోలు పట్టణానికి చెందిన ర్యాలి నాగేశ్వరరావు అనారోగ్యంతో విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలియడంతో మంగళవారం నిడదవోలు వీక్లీ మార్కెట్ సచివాలయ ఉద్యోగి ఎస్.సుబ్బారావు విజయవాడ ఆసుపత్రికి వెళ్లి పెన్షన్ అందజేశారు.

ఆసుపత్రిలో ఉన్నా ఆపలేదు..



చాగల్లు : రాజమహేంద్రవరం జీఎస్ఎల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వాకా నరసింహమూర్తి, రాజారత్నం, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బెల్లాపు సావిత్రిలకు సచివాలయ ఉద్యోగులు వారి వద్దకు వెళ్లి పింఛన్లు అందజేశారు. సోమవారం పింఛను పంపిణీకి వెళితే సమాచారం అందడంతో మంగళవారం ఉదయమే వారి వద్దకు వెళ్లి పింఛను అందజేశారు. ఈ మేరకు వారు అభినందనలు తెలిపారు.

మాజీలకు గన్‌మెన్‌లు ఇంకానా!?



- గత నెల 4న ఫలితాలు విడుదల
- 28 రోజులుగా మాజీలకు గన్‌మెన్‌లు
- కొనసాగింపుపై విమర్శలు
- 'తూర్పు'లో 'త్రెట్'పై ఎద్దేవా
- ఇటీవల భరత్ వాహనం దహనం
- డీజీపీకి మాజీ ఎంపీ వినతి
- గతంలో టీడీపీ స్వచ్ఛందంగా వెనక్కి
- ఇప్పుడు నెల కొనసాగింపు
- నేటితో ముగియనున్న పొడిగింపు

ప్రజలు ఓటుతో వద్దన్నా.. వదలని దర్పం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

'తూర్పు' ఎప్పుడూ ప్రశాంతమే. నాయకులపై దాడులు జరిగిన ఘటనలు లేవు. భద్రతకు వచ్చిన ముప్పు లేదు.ఈ నేపథ్యంలో గతంలో ఓడిపోయిన వెంటనే టీడీపీ నేతలు స్వచ్ఛందంగా తమకు కల్పించిన గన్‌మెన్ సౌకర్యాన్ని వదులుకున్నారు. కానీ ఈ సారి ఎన్నికల్లో ప్రజలు ఓటుతో చాచి కొట్టినా వైసీపీ నాయకులు మాత్రం దర్పం వెలగబెట్టడానికి వెనుకాడడం లేదు. అధికారులను బ్రతిమలాడి గన్‌మెన్ గడువును ఈ నెల 4వ తేదీ వరకూ పొడిగించుకున్నారు.మరి రేపటితో వారిని డిపార్ట్‌మెంట్‌కి పంపేస్తారా లేదా ఏదైనా ఎత్తుగడ పారించి మరి కొద్ది రోజులు పొడిగింపజేసుకుంటారా?అనే చర్చ నడుస్తోంది.

మాజీలైనా వదలరా?

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలు, మంత్రులు ఇలా కొన్ని విభాగాల ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం గన్‌మెన్ సదుపాయాన్ని ఇస్తుంది. ప్రజా ప్రతినిధులు నిత్యం ప్రజల్లో తిరుగుతుంటారని, వారు తీసుకొనే నిర్ణయాలపై కూడా కొందరికి వ్యతిరేకత ఉండొచ్చని.. భద్రత దృష్ట్యా గన్‌మెన్‌లను ఇస్తారు. సాధారణంగా ఒక్కొక్కరికి ఇద్దరు చొప్పున గన్‌మెన్‌లను పోలీసు శాఖ నుంచి కేటాయిస్తారు.పదవిలో ఉన్నంత సేపు వీళ్లు కొనసాగుతారు. ఓటమి పాలైతే మాత్రం నాయకులే స్వచ్ఛందంగా గన్‌మెన్‌లను అప్పగించాలి. వాస్తవానికి జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి.జిల్లాలోని ఒక ఎంపీ, ఏడు అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు జయ కేతనం ఎగురవేశారు. వైసీపీకి ఒక్క సీటు దక్కలేదు. వైసీపీ ప్రజాప్రతినిధులు మాజీలు అయిపోయారు. కానీ ప్రభుత్వం కల్పించే గన్‌మెన్ సదుపాయం ఇప్పటికీ వాడుకుంటున్నారు. దీని వల్ల వారికి జీతాలుగా ఇచ్చే ప్రజాధనం వృథా అవుతోంది. జిల్లాలో వైసీపీ మాజీలకు 10 మంది గన్‌మెన్‌లు ఇంకా విధుల్లో ఉన్నారు.అంటే.. నెలకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున లెక్క వేసినా రూ.5 లక్షలు అనవసర ఖర్చు.

ఇక్కడ భయమెందుకు?

ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతాలు ఉండే రాయలసీమ, నక్సల్స్ ప్రభావం ఉండే ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులకు రక్షణగా గన్‌మెన్‌లు కచ్చితంగా ఉండి తీరాల్సిందే. అయితే ఎలాంటి భద్రత పరమైన ఇబ్బందులూ లేకపోయినా తూర్పుగోదావరిలో వైసీపీ మాజీ ప్రతినిధులకు గన్‌మెన్లను కొనసాగించడం విమర్శలకు తావిస్తోంది. ఎంపీగా పదవిలో ఉన్నప్పుడు రాజమహేంద్రవరం సిటీని మాత్రమే పట్టుకుతిరిగిన భరత్‌రామ్‌కి రక్షణపరంగా సమస్య ఏమిటో ఎవరికీ అర్థం కావడం లేదు.హోం మంత్రిగా పనిచేసినప్పుడు సాహసోపేతమైన నిర్ణయాల జోలికి వెళ్లని మాజీ హోం మంత్రి వనితకు సైతం గన్‌మెన్ ఉండడంపై మండిపడుతున్నారు. జిల్లాలో మాజీ హోం మంత్రి తానేటి వనిత, మాజీ ఎంపీ భరత్ రామ్,రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, గోపాలపురం మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నిడదవోలు మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడుకు ఇద్దరు చొప్పున గన్ మెన్‌లు కొనసాగుతున్నారు. శ్రీనివాసనాయుడుకు జిల్లా నుంచి ఒకరు, భీమవరం నుంచి మరొకరు ఉన్నారు. వనితకు జిల్లా నుంచి ఒకరు, విజయవాడ నుంచి మరొకరు విధుల్లో ఉన్నారు. ప్రజాధనం వృథా చేయకూడదనే బాధ్యత ఉంటే ఎన్నికల్లో ఓటమి చెందిన వెంటనే గన్‌మెన్‌లను వెనక్కి పంపేసి హుందా చాటుకోవాలి.కానీ గన్‌మెన్‌లను మరికొంత కాలం కొనసాగించాలని ఈ మాజీలు కోరడం చూస్తుంటే పదవిపోయినా దర్పం వదలడానికి ఇష్టపడ ట్లేనట్టుగా కనిపిస్తోంది.

త్రెట్ ఉందా?.. ఎత్తుగడా!

గన్‌మెన్‌ల సదుపాయాన్ని కల్పించడం, వారిని వెనక్కు రప్పించడం వంటివి త్రెట్ పెర్‌ఫెక్షన్ రిపోర్టు(టీపీఆర్) ఆధారంగా జరుగుతాయి. పోలీస్ నిఘా విభాగం తగు సమాచార సేకరణ ద్వారా టీపీఆర్‌ని తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తుంది. దాని ఆధారంగా భద్రత కల్పించడం జరుగుతుంది. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కూడా టీపీఆర్ ఆధారంగానే గన్‌మెన్‌లను వెనక్కు పిలిపిస్తారు. అయితే ఈ సారి చిన్న చిన్న ఘటనలను చూపి గన్‌మెన్‌లను నెల పాటు కొనసాగించాలనే ఆదేశాలు ఇచ్చారని తెలుస్తోంది. ఆ ఉత్తర్వుల ద్వారా సదుపాయాన్ని జూలై 4వ తేదీ వరకూ కల్పించారు. ఎన్నికల అనంతరం జిల్లాలో జరిగిన చెదురు మదురు సంఘటనలను సాకుగా చూపి గన్‌మెన్ సదుపాయాన్ని పొడిగించాలని కోరే ఎత్తుగడ వేస్తారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఎన్నికల కౌంటింగ్ తర్వాత నల్లజర్లలో రాళ్ల రువ్వుకోవడం జరిగింది. వాస్తవానికి దీనిని అక్కడి తాజాలు, మాజీలు కూడా పెద్దగా పట్టించుకోలేదు. మొన్న శుక్రవారం(28)న రాత్రి మాజీ ఎంపీ భరత్‌రామ్ తన ప్రచార రథాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారంటూ హడావుడి చేశారు. కానీ 2వ తేదీ వరకూ పోలీసులకు ఫిర్యాదు మాత్రం చేయలేదు. డీజీపీని కలిసి వినతిపత్రం ఇచ్చి అనంతరం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలాంటి ఘటనలను దర్పం కొనసాగింపునకు సాకుగా చూపుతారనే చర్చ నడుస్తోంది. తమ నేత జగన్ తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వాలంటూ గోల పెడుతుండగా.. ఆయన బాటలో నడిచే నాయకులు గన్‌మెన్‌ని కొనసాగించాలని గగ్గోలు పెట్టడంలో ఆశ్చర్యం ఏముందని ఎద్దేవా చేస్తున్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత మాజీ మంత్రి వేణు మాత్రమే తన గన్‌మెన్‌లను స్వచ్ఛందంగా వెనక్కి పంపేశారు. అంటే, జిల్లాలో ఈయనకు తప్ప మిగతా వారందరికీ త్రెట్ ఉన్నట్లా?.. లేక పదవిలో ఉన్నప్పుడు వారే పని చేసి ఈయన ఖాళీగా ఉన్నట్టా!?.



మాజీ ఎంపీ భరత్ వెనుక ఉన్న గన్‌మెన్

ఇంకా పదవిలోనేనా?

ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కూడా కార్లపై మెంబర్ ఆఫ్ పార్లమెంట్, ఎమ్మెల్యే అనే స్టిక్కర్లను అలాగే ఉంచడం.. వాటిలోనే తిరుగుతుండడం మరో రకమైన వెర్రి అంటూ పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. మాజీలు అయిపోయి 26 రోజులు గడిచినా ఇంకా ఆ యావ పోకపోవడంపై ఎద్దేవా చేస్తున్నారు.వీళ్లు స్టిక్కర్లు పెట్టుకొని తిరుగు తుంటే.. తాజాగా ప్రజలు గెలిపించుకున్న వాళ్లు ఏ స్టిక్లర్లు తమ కార్లకు వేసుకోవాలని ప్రశ్నిస్తున్నారు.



మాజీ ఎంపీ భరత్ కార్లపై ఉన్న మెంబర్ ఆఫ్ పార్లమెంట్ స్టిక్కరింగ్

రేపు విద్యాసంస్థల బంద్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 2 : నీట్ పరీక్ష పేపర్ లీకేజీని నిరసిస్తూ పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ తదితర విద్యార్థి సంఘాలు జూలై 4వ తేదీన బంద్‌కు పిలుపును ఇచ్చాయి. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కళాశాలలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర జనరల్ కార్యదర్శి జి.తారకేశ్ పోస్టర్ ఆవిష్కరించారు. ఎల్‌కేజీ టు పీజీ వరకూ అన్ని విద్యాసంస్థలు బంద్‌లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజా, పీడీఎస్‌యూ కె.భాను, రాంబాబు, దినేష్, శివ తదితరులు పాల్గొన్నారు.



ర్యాంపుల్లో ఇసుక తరలిస్తే ఊరుకోం 8

గోదావరి ర్యాంపుల నుంచి ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాత్సవ హెచ్చరించారు.. నిడదవోలు మండలం పెండ్యాల, పందలపర్రు, పెరవలి మండలం తీపర్రు ఇసుక ర్యాంపులను మంగళవారం పరిశీలించారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా బీసీ పాయింట్‌లో 40 లక్షలు గోల్‌మాల్? 8

పన్నుల విధానంపై అవగాహన ఉండాలి

ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ రాష్ట్రాధ్యక్షుడు శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కొవ్వూరు, జూలై 2: మారుతున్న ప్రభుత్వ పన్నుల విధానాలపై ఎప్పటికప్పుడు ట్యాక్స్ ప్రాక్టీషనర్లు, కన్సల్‌టెంట్లకు రాష్ట్ర కమిటీ అవగాహన కల్పిస్తుందని కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు అన్నారు. కొవ్వూరు యువరాజ్ ఫంక్షన్ హాలులో నిడదవోలు ట్యాక్స్ ప్రాక్టీషనర్స్, కన్సల్‌టెంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా టీవీ రవిబాబు, ఉపాధ్యక్షుడిగా ఎం.బాల సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా కె.నాగబాబు, జాయింట్ సెక్రటరీగా పి.వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఎస్.అజయ్‌కుమార్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ పన్నుల విధానంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న మార్పులను సభ్యులకు ఎప్పటికప్పుడు అవగాహనా సదస్సులు ఏర్పాటుచేసి జీఎస్టీ విధానంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీఎఫ్‌టీడీ ప్రెసిడెంట్ దామరాజు శ్రీనివాసరావు, ఏపీటీపీసీఏ రాష్ట్ర జనరల్ సెక్రటరీ యూఎస్‌ఎన్ రాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యుడు వీవీ సుబ్రహ్మణ్యం, ట్యాక్స్ ప్రాక్టీషనర్, కన్సటెంట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

కొవ్వూరు, జూలై 2: మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునని బీజేపీ నాయకుడు పిల్లలమర్రి మురళీకృష్ణ అన్నారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన ఏక్ పెడ్ మా కే నామ్ కార్యక్రమాన్ని మంగళవారం కొవ్వూరులో మొక్కలు నాటి ప్రారంభించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ చెట్లను నరికివేయడంతో ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు సంభవిస్తున్నాయన్నారు. ప్రతిఒక్కరూ తమ ఇంటి వద్ద మొక్కలు నాటి సంరక్షించాలని తద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు, బోడపాటి ముత్యాలరావు, ఎం.ఆంజనేయులు, గండ్రోతు పవన్, అడ్డూరి సత్యనారాయణ, జి.శివకృష్ణ పాల్గొన్నారు.

ఏబీఎన్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

కొవ్వూరు, జూలై 2: కొవ్వూరు ఏబీఎన్, పీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో విన్నాగ్ ఏఐ ఆప్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ మంగళవారం ప్రతినిధులు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. కళాశాలలో ఫైనలియర్ బీఎస్సీ, బీకాం పూర్తిచేసిన విద్యార్థులకు ఈ ఇంటర్వ్యూలకు సుమారు 58 మంది హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్‌వీ సుబ్బారావు, విన్నాగ్ సంస్థ సీఈవో శేషు కొండపల్లి, ప్రతినిధి సిరి, క్యాంపస్ ఇంటర్వ్యూల అధికారి కె.సూరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న టీడీపీ నాయకులు

నల్లజర్ల, జూలై 2: టీడీపీ అధికారంలోకి రావాలని, మద్దిపాటి వెంకటరాజు ఎమ్మెల్యేగా విజయం సాధిస్తే 108సార్లు హనుమాన్ చాలీశా పారాయణం చేస్తామని మండలంలోని అచ్చన్నపాలెంలో పాతూరి రమేష్, నల్లజర్లకు గన్నిన శ్రీనివాసరావు వారి గ్రామాల్లో ఆంజనేయస్వామికి మొక్కుకున్నారు. ఈ మేరకు మంగళవారం మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు ఆంజనేయస్వామి ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అచ్చన్నపాలెంలో 108 కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, జమ్ముల సతీష్, రావూరి వెంకటరమణ, వల్లూరి సత్తిపండు, ఉన్నమట్ల ఇసాకు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్ బొమ్మకు నల్లరంగు

పెరవలి, జూలై 2: రాష్ట్ర ప్రభుత్వం మారి నెల రోజులు కావస్తున్నప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలపై మాజీ సీఎం జగన్ ఫొటోతో నవరత్నాలు తెలిపే విధంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలను చాలాచోట్ల ఇంకా తొలగించలేదు. అవి తొలగించాలని గ్రామాలోని కూటమి కార్యకర్తలు.. పంచాయతీ సిబ్బందిని కోరుతున్నప్పటికీ తమకు పైనుంచి ఆదేశాలు రాలేదంటూ తప్పించుకుంటున్నారు. అయితే సోమవారం పింఛన్ల పంపిణీ నిమిత్తం మంత్రి దుర్గేష్ తీపర్రు వచ్చిన సందర్భంగా గ్రామ కార్యకర్తలు పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ బొమ్మలను మీరు తొలగిస్తారా.. మమ్మల్ని తొలగించమంటారా అని హెచ్చరించడంతో వెంటనే ఆ బొమ్మపై నల్ల పెయింటింగ్ వేసి కనపడకుండా చూశారు. ఇంకా పలు గ్రామాల్లో సచివాలయాలపై ఇదే విధంగా జగన్ బొమ్మ కనిపిస్తుండడంతో పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తల క్షేత్రస్థాయి పర్యటన


వరినాట్లను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

తాళ్ళపూడి, జూలై 2: ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు తాళ్ళపూడి, కొవ్వూరు, నిడదవోలు మండలాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేసి పెరుగుతున్న వరి నారుమళ్లు, నాట్లును పరిశీలించారు. నారు ఆరోగ్యంగా ఉన్నట్టు గమనించారు. ప్రయోగాల నిమిత్తం ఇచ్చిన విత్తనాలు బీపీటీ-3082, బీపీటీ-2858, ఎంటీయూ-1271, 1275, 1310 వంటి రకాలతో నారుమడి స్థాయి నుంచి నాట్లు వేసుకునే స్థాయి వరకూ గమనించామన్నారు. రైతాంగం శాస్త్రవేత్తలు సూచించిన విధంగా ఎరువులు వేస్తే పంట ఆరోగ్యంగా ఉండి మంచి దిగుబడికి అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వీ నరశింహరావు, పి.అమ్మాజీ, హైమజ్యోతి, ఏవోలు రుచిత, గంగాధర్, సత్యనారాయణ, వీపీఏలు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యకు

కారణమైన వ్యక్తికి నాలుగేళ్ల జైలు

ఉండ్రాజవరం, జూలై 2: ఒక వ్యక్తి మహిళను అసభ్యకరంగా దూషించి, కొట్టడంతో అవమానం భరించలేక ఆమె ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనకు కారకుడైన వ్యక్తికి నాలుగేళ్ల జైలు, రూ.3 వేలు జరిమానా విధిస్తూ తణుకు ఐదో అదనపు జిల్లా కోర్టు జడ్జి, మహిళా కోర్టు జిల్లా న్యాయమూర్తి జి.రాజేశ్వరి మంగళవారం తీర్పు చెప్పినట్టు ఉండ్రాజవరం పోలీసులు మంగళవారం తెలిపారు. మండలంలోని వేలివెన్ను గ్రామంలో మల్లిపూడి గౌతమిని, అదే గ్రామానికి చెందిన సిర్రా లక్ష్మణరావు 2020 మార్చి 15న తిట్టి, కొట్టి ఉరివేసుకుని చనిపోతే మంచిదని దూషించాడు. అవమానం తట్టుకోలేక ఆమె ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అప్పట్లో ఎస్‌ఐ అవినాష్ కేసు నమోదు చేశారు. కేసు విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు లక్ష్మణరావుకు జైలు శిక్షతోపాటు, జరిమానా విధించినట్టు పోలీసులు తెలిపారు. బాధితుల తరపున ఏపీపీ డీవీ రామాంజనేయులు వాదించారు. ఎస్‌ఐ వి.అప్పలరాజు, పోలీసు సిబ్బంది సహకరించారు.

లోకేశ్‌ను కలిసిన నూతంగి దొరబాబు

గోపాలపురం, జూలై 2: రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన టీడీపీ సాంస్కృతిక విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి నూతంగి దొరబాబు ఉండవల్లిలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక విభాగ రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో లోకేశ్‌ను కలిసి, పార్టీ కోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలను గుర్తించి నామినేటెడ్ పదవుల్లో వారికి ప్రాధాన్యత కల్పించాలని కోరినట్టు దొరబాబు చెప్పారు.

రూ.40 లక్షలు గోల్‌మాల్!

- జి.ఎర్రంపాలెంలోని బరోడా బ్యాంక్‌లో ఘటన
- చెల్లింపులు, రికార్డుల్లోని వివరాల్లో తేడాలు
- బ్యాంకులో బీసీ పాయింట్ వ్యక్తిపై అనుమానాలు


విషయాలను వివరిస్తున్న డ్వాక్రా మహిళలు


స్వయం సహాయక సంఘానికి ఇచ్చిన రశీదు

దివాన్‌చెరువు, జూలై 2: రాజానగరం మండలంలోని జి.ఎర్రంపాలెంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలో దాదాపు రూ.40 లక్షలు మేర సొమ్ము గోల్‌మాల్ జరిగినట్టు తెలుస్తోంది. బ్యాంకులో బీసీ పాయింట్‌కు చెందిన వ్యక్తి ఈ అవకతవకలకు పాల్పడినట్టు కొంతమంది ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరగవలసి ఉంది. దీనికి సంబంధించి వివరణ ఇచ్చేందుకు బ్యాంకు బ్రాంచి మేనేజర్ నిరాకరించారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించాలని కొందరికి ఫోన్లు వెళ్లడం, కొన్ని స్వయం సహాయక సంఘాలు చెల్లించిన సొమ్ముకు, బ్యాంకు రికార్డుల్లో నమోదైన సొమ్ములో తేడాలుండడంతో ఈ వ్యవహారం వెలుగు చూసింది. ఖాతాదారుల సౌకర్యార్థం ఒక వ్యక్తిని తమ ప్రతినిధిగా బ్యాంకు నియమించుకుంది. ఖాతాదారులకు బ్యాంకు వెలుపల ఆ వ్యక్తి అందుబాటులో ఉండి సేవలందించాల్సి ఉంది. అయితే అందుకు భిన్నంగా జి.ఎర్రంపాలెంలోని బీసీ పాయింట్‌కు చెందిన వ్యక్తి బ్యాంకు ఆవరణలోనే ఉంటూ డ్వాక్రా సంఘాలు, రైతులు బ్యాంకుకు చెల్లించవలసిన సొమ్ములో కొంత తానే కట్టించుకుని రశీదులు ఇచ్చే వారని కొంతమంది డ్వాక్రాసంఘాల సభ్యులు తెలిపారు. దీంతో వారంతా బ్యాంకు ప్రతినిధులే అయి ఉంటారని తాము అనుకున్నామన్నారు. ఆ గ్రామంలోని మేరీమాత స్వయం సహాయక సంఘానికి చెందిన కోనె లక్ష్మిని విలేకరులు ఈ విషయమై ప్రశ్నించగా ఐదు నెలలుగా తాము చెల్లించిన రూ1.20 లక్షలు సొమ్ము తేడా వచ్చిందన్నారు. తాము బ్యాంకులో చెల్లించిన సొమ్ము బాగానే ఉందని, బ్యాంకు ప్రతినిధి నానిబాబు అనే వ్యక్తికి చెల్లించినసొమ్ములోనే ఈ వ్యత్యాసం వచ్చిందన్నారు. బ్యాంకుకు తాము వచ్చినపుడు రూ.10 వేల లోపు సొమ్మును తమ బ్యాంకు ప్రతినిధికి చెల్లించవలసినదిగా కొంతమంది బ్యాంకు సిబ్బందే తమకు చెప్పేవారన్నారు. సుజాత గ్రూపునకు చెందిన దమ్ము దుర్గ మాట్లాడుతూ తమ సంఘానికి సంబంధించి రూ.20 వేలు తేడా వచ్చాయన్నారు. శారదా గ్రూపునకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు పోశమ్మ, యజ్జ కళ్యాణి మాట్లాడుతూ తమ సంఘం పొదుపు సొమ్ము బ్యాంకుకు రూ.92 వేలు చెల్లిస్తే తమ ఖాతాలో ఏడు వేలు మాత్రమే కనబడుతోందని చెప్పారు. రెండు సంవత్సరాల క్రితం తమకు రూ.60 వేలు రుణం వచ్చిందని, అప్పటి నుంచీ తమ ఖాతాలో పొదుపు సొమ్ములేదని గుర్తించామన్నారు. ఈ విషయమై యానిమేటర్‌ను అడగగా అప్పులు ఆలస్యంగా చెల్లించిన వారికి పొదుపు సొమ్ము అప్పుకు జమ చేసి ఉండవచ్చని తెలిపారన్నారు. తాము ఈ లోపాలను గుర్తించి కొంతకాలంగా బ్యాంకు చుట్టూ తిరుగుతుంటే నాలుగు రోజుల్లో చెబుతామని సిబ్బంది అన్నారన్నారు. సత్యసాయి స్వయం సహాయక సంఘానికి సంబంధించి రూ.60 వేల వరకూ తేడా వచ్చినట్టు తెలిసింది. జి.ఎర్రంపాలెం, సంపత్‌నగరం, పుణ్యక్షేత్రం గ్రామాల్లోని 93 స్వయం సహాయక సంఘాల వారు ఈ బ్యాంకు ద్వారా లావాదేవీలు జరుపుతున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. అలాగే ఖాతాదారులు బ్యాంకు ద్వారా నగదు జమ, విత్‌డ్రా వంటి లావాదేవీలు జరిపినపుడు సంబంధిత పాస్ పుస్తకాల్లో ఎంట్రీలను ఎప్పటికపుడు సిబ్బంది నమోదు చేసి ఉంటే ఇటువంటి వాటికి ఆస్కారం ఉండేది కాదని కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ విషయమై బ్రాంచి మేనేజర్ బీఎన్ రాజును మంగళవారం విలేకరులు కలసి ప్రశ్నించగా వివరణ ఇచ్చేందుకు నిరాకరించారు.

రికార్డులను కంప్యూటరైజేషన్ చేయించుకోవాలి

- పలు వ్యవసాయ సొసైటీల సీఈవోలు

కొవ్వూరు/చాగల్లు/దేవరపల్లి/ఉండ్రాజవరం, జూలై 2: కొవ్వూరు మండలంలోని పశివేదల ది రంగరాయ విశాల సహకార సంఘం సభ్యులు తమ రికార్డులను తప్పనిసరిగా కంప్యూటరైజేషన్ చేయించుకోవాలని సొసైటీ సీఈవో కరుటూరి శ్రీనివాసరావు తెలిపారు. సొసైటీ పరిధిలోని పశివేదల, తోగుమ్మి, వాడపల్లి, నందమూరు గ్రామాలకు చెందిన సంఘం సభ్యులు కంప్యూటీకరణ చేయించుకోవాలని చెప్పారు. చాగల్లు మండలం ఊనగట్ల సొసైటీ పరిధిలోని చాగల్లు, నెలటూరు మీనానగరం, ఊనగట్ల, నందిగంపాడు, ఎస్.ముప్పవరం, బ్రాహ్మణగూడేనికి చెందిన సభ్యులు తమ రికార్డుల వివరాలను కంప్యూటీకరణ చేయించుకోవాలని కార్యదర్శి కె.శ్రీనివాసరావు కోరారు. దేవరపల్లి వ్యవసాయ సొసైటీ పరిధిలోని దేవరపల్లి, కొత్తగూడెం, రామన్నపాలెం, సుబ్బారాయపురం, ధూమంతనగూడెం, అచ్చయ్యపాలెం, బుచ్చయ్యపాలెం, గ్రామాలకు చెందిన సంఘ సభ్యులు తమ రికార్డుల వివరాలను కంప్యూటరైజేషన్ చేయించుకోవాలని కార్యదర్శి కల్లూరి సత్యశ్రీనివాస్‌శర్మ తెలిపారు. సొసైటీల్లో సభ్యత్వం తీసుకుని ఇంతవరకు ఎలాంటి లావాదేవీలు జరపని సభ్యులు సంఘంలో కొనసాగాలంటే తమ రికార్డులు కంప్యూటరైజేషన్ చేసుకోవాలని చెప్పారు. ఉండ్రాజవరం మండలంలోని వ్యవసాయ సొసైటీల్లోని సభ్యులందరూ తమ వివరాలను కంప్యూటరీకరణ చేయించుకోవాలని ఉండ్రాజవరం సొసైటీ సీఈవో కె.నాగన్న మంగళవారం సభ్యులను కోరారు. ఈనెల 4వ తేదీ సాయంత్రం 5గంటలకు లోగా సొసైటీ కార్యాలయాల్లో తమ వివరాలను కంప్యూటరీ కరణ చేసుకోవాలని పాలంగి, చివటం సొసైటీల సీఈవోలు విష్ణుమూర్తి, సత్యనారాయణ చెప్పారు. ఇందుకోసం ఆధార్‌కార్డు జిరాక్స్‌లు 2 కాపీలు, 2 పాస్‌పోర్ట్ ఫొటోలు, ఫోన్ నెంబరు ఆయా సొసైటీ కార్యాలయాల్లో అందజేయాలన్నారు.

విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యం

- ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు


నల్లజర్ల: అనంతపల్లిలో విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే మద్దిపాటి

దేవరపల్లి, జూలై 2: విద్యా, వైద్య రంగాలకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని యర్నగూడెంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీని మంగళవారం ఆయన సందర్శించి హైస్కూల్, జూనియర్ కాలేజీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఇంటర్ ఫస్టియర్‌లో రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన యర్నగూడేనికి చెందిన కరుణ్యకు ఆయన ల్యాప్‌టాప్ బహుమతిగా అందజేశారు. కళాశాలకు అదనపు గదుల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో లండన్ కిడ్స్ స్కూల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్ర మంలో టీడీపీ మండలాధ్యక్షుడు అంద్రూ అనీల్, పెనుమత్స సుబ్బరాజు, బొల్లిన భాస్కర్, గద్దే శ్రీనివాస్, ప్రత్తిపాటి హరినాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనంతపల్లిలో విజయోత్సవ ర్యాలీ

నల్లజర్ల, జూలై 2: మండలంలో అనంతపల్లిలో మంగళవారం కూటమి విజయోత్సవ ర్యాలీ జరిగింది. మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్ ఆధ్వర్యంలో ఆయన ఇంటి వద్ద నుంచి బయలుదేరి పురవీధుల్లో ర్యాలీ జరిపారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు గ్రామస్థులు గజమాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో తాతిన సత్యనారాయణ, గురిమిల్లి శ్రీనివాసరావు, రాజా బ్రదర్స్ గన్నమని కృష్ణమోహన్, యద్దనపూడి బ్రహ్మరాజు, పసుమర్తి రతీష్, కండెపు వెంకటరత్నం, యలమాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సేవాభావంతో పనిచేద్దాం

- కలవలపల్లి విజయోత్సవ సభలో ఎమ్మెల్యే ముప్పిడి


ఎమ్మెల్యే ముప్పిడిని సత్కరిస్తున్న కలవలపల్లి గ్రామస్థులు

చాగల్లు, జూలై 2: నియోజవర్గం అభివృద్ధి చేసుకోవడానికి అందరం కలసి సేవాభావంతో కలసి పనిచేద్దామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని కలవలపల్లిలో మంగళవారం కూటమి విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ సహకారంతో సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని, అందుకు మనం కూడా భాగస్వాములు కావాలన్నారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని, వైసీపీ నాయకులు అరాచకాలు, అరెస్టులు, వేధింపులకు వ్యతిరేకంగా ప్రజలు తీర్పునిచ్చారని చెప్పారు. జగన్ పాలన ఒక పీడ కలగా మర్చిపోవాలని, అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా అందరం కలిసి పనిచేద్దామన్నారు. గ్రామ టీడీపీ నాయకుడు కొండేపాటి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, కేతా సాహెబ్, అబ్బూరి సీతారామాంజనేయులు, వల్లభని సూర్యప్రకాశరావు, గూడపాటి వెంకట్, కొండేపాటి సత్యనారాయణ, మద్దిపాటి వీరరాఘవులు సహా పార్టీ విజయానికి కృషి చేసిన టీడీపీ నాయకులను ఎమ్మెల్యే చేతుల మీదుగా సన్మానించారు. స్థానిక హైస్కూలు విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాలతో కూడిన స్కూలు కిట్‌లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

ఎన్టీఆర్ సృజల స్రవంతి వాటర్ ప్లాంట్ ప్రారంభం

తాళ్లపూడి, జూలై 2: రావూరుపాడులో నిర్మించిన ఎన్టీఆర్ సృజల స్రవంతి వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, రేకపల్లి ముత్యాల రావు, మంగామణి దంపతులు, సిద్దా దుర్గారావు, పుప్పాల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇసుక తరలించకుండా చర్యలు తీసుకోవాలి

- కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ


నిడదవోలు: పెండ్యాలలో ఇసుక ర్యాంపు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

పెరవలి/నిడదవోలు, జూలై 2: ఇసుక గుట్టల నుంచి ఇసుక తరలించకుండా స్థానిక రెవెన్యూ అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని, ఇసుకను ఏవిధంగా పంపిణీ చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. నిడదవోలు మండలం పెండ్యాల, పందలపర్రు, పెరవలి మండలం తీపర్రు-ఉసులుమర్రు మధ్య నిడదవోలు-నరసాపురం రోడ్డుకు చేర్చి ఉన్న ఇసుక ర్యాంపులను, గుట్టలను మంగళవారం పరిశీలించారు. ర్యాంపుల వద్ద ఉన్న స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వల వివరాలు సేకరించారు. తీపర్రులో సుమారుగా 20వేల క్యూబిక్ మీటర్ల ఇసుక ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ వెంట కొవ్వూరు ఆర్డీవో ఆఫీస్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.రవి విక్రమ్, జియాలజిస్ట్ విఘ్నేశ్వరరావు, తహసీల్దార్ సుధ, సర్వేయరు గోపాలకృష్ణ తదితరులున్నారు.

పింఛన్లు 99 శాతం పంపిణీ

ఉండ్రాజవరం, జూన్ 3: మండలంలో పింఛన్ల పంపిణీ 99శాతం చేసినట్టు ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి మంగళవారం తెలిపారు. మండలంలో 10,512 వివిధ రకాల పింఛన్లు ఉండగా, వాటిలో ఇంతవరకు 10,414 పంపిణీ చేశామన్నారు. మిగిలిన వారిలో 62మంది మరణించారని, 21మంది వేర్వేరు ప్రదేశాల్లోను, 12మంది ఇతర దేశాల్లో నివసిస్తున్నందున వారికి పంపిణీ జరగలేదని చెప్పారు. ప్రభుత్వ సిబ్బందితోపాటు నాయకులు ఇంటింటికీ వెళ్లి పింఛను సొమ్ము అందజేశారని చెప్పారు.

ప్రైవేటు స్కూల్‌ను తనిఖీ చేసిన ఆర్డీవో


లిటిల్ ప్యారడైజ్ స్కూల్ తనిఖీ చేస్తున్న ఆర్డీవో

రాజమహేంద్రవరం సిటీ, జూలై 2: రాజమహేంద్రవరంలో ప్రైవేట్ విద్యాసంస్థలో ఉచిత సీటు పొందిన విద్యార్థుల పట్ల ఆయా పాఠశాలలో అనుసరిస్తున్న తీరు దారుణంగా ఉందని తల్లిదండ్రులు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదుపై 24 గంటల్లో స్పందన వచ్చింది. కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు ఆర్డీవో చైత్రవర్షిణి మంగళవారం రాజమహేంద్రవరంలో లిటిల్ ప్యారడైజ్ స్కూల్‌ను తనిఖీ చేశారు. అక్కడ చిన్నారులతో చైత్రవర్షిణి మాట్లాడారు. ఉచిత సీట్లు ఇచ్చిన చిన్నారులకు ఇతర పిల్లలతో సమానంగా విద్యాబోధన చేయాలని స్పష్టం చేశారు.

టీచ్‌టూల్ ఉపాధ్యాయ శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ, జూలై 2: రాజమహేంద్రవరం డీఎంహెచ్ స్కూల్‌లో జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణ తరగతులను జిల్లా సమగ్రశిక్షా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్.సుభాషిణి పరిశీలించారు, మంగళవారం పాఠశాలకు వచ్చిన ఆమె మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలు తరగతి స్థాయికి చేరేలా చూడాలన్నారు. విద్యలో ఉత్తమ ప్రమాణాలు సాధించాలంటే బోధనలో మెలకువలు నేర్చుకోవాలని మారుతున్న విధానాలకు అనుగుణంగా బోధనా నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ రేంజ్ డీఐ,కోర్స్ కోఆర్డినేటర్ బి.దిలీప్ కుమార్, విషయనిపుణులు ఎన్.శ్రీనివాస్, ప్రవీణ్, శిరీష్ పాల్గొన్నారు.

కోటిలింగాల కైలాస భూమిలో

మాజీ మంత్రి వేణు తల్లి అంత్యక్రియలు



రాజమహేంద్రవరం సిటీ, జూలై 2: రాష్ట్ర మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ మాతృమూర్తి సుభద్రమ్మ (94) రామచంద్రపురంలో సోమవారం మరణించారు. ఆమె చివరి కోరిక మేరకు మంగళవారం రాజమహేంద్రవరం కోటిలింగాల కైలాస భూమిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా కైలాస భూమి వద్ద సుభద్రమ్మ పార్థివ దేహానికి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ ,మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, రౌతు సూర్యప్రకాశరావు నివాళులర్పించారు. మాజీ మంత్రి వేణును కలిసి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

రంగంపేట, జూలై 2: రంగంపేట జడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలను మంగళవారం కూటమి నాయకులు పరిశీలించారు. విద్యార్థులకు ఇస్కాన్ సౌజన్యంతో రాగిజావ, పులిహోర, దొండకాయ పచ్చడి ఆహారంగా అందించారు. కార్యక్రమంలో యలమాటి రాంబాబు, పోతుల చిన్నికాపు, మండవిల్లి గుప్త, గుండుబిల్లి వరప్రసాద్, ఉంవిల్లి శివప్రసాద్, పసల వికాస్, బొల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బీమా ఉద్యోగుల సంఘం ఆవిర్భావ దినోత్సవం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 2: రాజమహేంద్రవరం ఎల్‌ఐసీ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం అఖిల భారత బీమా ఉద్యోగులసంఘం 74వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. యూనియన్ పతాకాన్ని అధ్యక్షుడు గుబ్బల రాంబాబు ఆవిష్కరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ మాట్లాడుతూ ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ అభివృద్ధికి ఉద్యోగులు ఎల్లప్పుడూ ముందుంటారన్నారు. కార్యక్రమంలో ఈశ్వరరావు, భరణి, సత్యదేవ, మాథ్యూస్, జి.శ్రీనివాస్, శిరీష, రాజ్యం, రమణ, దుర్గ, గనెయ్య, విశ్వనాథ్, బాలు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇసుక పాలసీ ఎలా ఉంటుందో?

- ఎదురు చూస్తున్న ప్రజలు..జిల్లాలో ఆగిపోయిన ర్యాంపులు..ఇసుక కొరత

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడం, మళ్లీ సీఎంగా నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టడంతో ఇసుక వినియోగదారులు, వ్యాపారులు, బోట్స్‌మన్ సొసైటీలు ఆనందంగా ఉన్నాయి. 2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చినపుడు చంద్రబాబు ఉచిత ఇసుక విధానం తేవడంతో భవన నిర్మాణ రంగం అభివృద్ధి చెందింది. భవన నిర్మాణ రంగం మీద ఆధారపడిన వేలాది కార్మికులు హ్యాపీగా ఉండేవారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలు కూడా ఇల్లు కట్టుకోవాలంటే, ఇసుక ఇబ్బంది ఉండేది కాదు. కేవలం ఎగుమతి, రవాణా చార్జీలు పెట్టుకుంటే ఇసుక ఇంటికి వచ్చేది. కానీ 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వినియోగదారుల కోణం నుంచి ప్రభుత్వం ఆలోచించలేదు. అంతా ఆదాయ మార్గంగానే ఆలోచించింది. పైగా బోట్స్‌మన్ సొసైటీలు, ఇసుక వ్యాపారు లందరినీ దెబ్బకొట్టి, కేవలం జిల్లాకు ఒకరిద్దరు వ్యక్తులను పెట్టుకుని, వాళ్ల ఆధ్వర్యంలో ఇసుక తవ్వకాలు, అమ్మకాలు జరిపిన సంగతి తెలిసిందే. జిల్లాల వారీ పెద్ద సంస్థలకు కాంట్రాక్టు ఇచ్చినట్టు మొదట్లో ఇసుక పాలసీ ప్రకటించినా తర్వాత దానిని ప్రక్కన పడేసి, వైసీపీ పెద్దలే ఇసుక బొక్కడం మొదలు పెట్టిన సంగతి తెలిసిందే. ఓపెన్ ర్యాంపుల్లో ఎమ్మెల్యేలు, ఎంపీ, ఇతర వైసీపీ నేతలు ఇసుక రంగంలోకి దిగి, బోట్స్‌మన్ సొసైటీలను తరిమేసి, వారి స్థానంలో తమ అనుచరులనుపెట్టుకుని ఇసుక డ్రెడ్జింగ్ చేయించి, దానిని వైసీపీ తరపున ఉన్న గుత్తేదార్లకు అందించేవారు. టన్నుకు రూ. 150నుంచి 200వరకూ రావడంతోపాటు బాట చార్జీలు అదనంగా వచ్చేవి. పార్కింగ్ చార్జీలు కూడా వసూలు చేసేవారు. మధ్యలో కొన్ని లారీలను లెక్కలో లేకుండా తప్పించేవారు. ర్యాంపుల వద్ద వైసీపీ తరపున వ్యక్తులు కాపాలా కాసీ, డిజిటల్ లావాదేవీలు లేకుండా, కేవలం నగదు లావాదేవీలే చేసేవారు. ఇక్కడ మరొక్క విషయం గమనించాలి.గతంలో ర్యాంపులు ఎంపిక చేయాలంటే ఇరిగేషన్, మైన్స్, భూగర్భజలశాఖ, రెవిన్యూ వంటి శాఖల అధికారులంతా పర్యటించి, అక్కడ సరిహద్దులు నిర్ణయించి, ఎంత ఇసుక తవ్వుకోవచ్చో లెక్క కట్టేవారు. దాని వివరాలను జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో చర్చించి, పర్యావరణ అనుమతులు పొందిన తర్వాత ఇసుక తీసుకోవడానికి అనుమతి ఇచ్చేవారు. కానీ వైసీపీ ప్రభుత్వం అవేవీ లేవు.కేవలం వాళ్ల అనుకోవడం, తవ్వేసుకోవడం, అమ్మేసుకోవడం, డబ్బు మూటలు పట్టుకుని పోవడం అంతే జరిగింది. ఏ ర్యాంపులో ఎంత ఇసుక తవ్వారో కూడా లెక్కలు లేని వైనం. మైన్స్, ఇరిగేషన్, రెవెన్యూ, సెబ్, పోలీసు, భూగర్భజలశాఖ, అటవీ, సంబంధిత శాఖలన్నీ నిర్వీర్యమయ్యాయి. ఇరిగేషన్, మైన్స్ అధికారుల అనుమతి కూడా లేకుండా రూ.కోట్ల ఇసుక తవ్వేశారు. నెలకు రూ.10కోట్ల వరకూ వైసీపీ పెద్దలకు కప్పం అందేది. కొవ్వూరులో వైసీపీ పార్టీకి చెందిన వ్యక్తి, పశ్చిమగోదావరిలో నెలకు రూ.30కోట్లు చెల్లించడానికి ఒప్పుకుని, అప్పుల పాలైరైలు పట్టాల కింద తలపెట్టి బలవన్మరణం చెందిన సంగతి తెలిసిందే. ఇలాఇసుక దోపిడీకి మారుపేరుగా మారిపోయింది. పూర్వం నుంచి ఇసుక తీత మీద ఆధారపడి జీవనం పొందుతున్న బోట్సుమన్ సొసైటీలను మూలకు నెట్టేసి, అక్రమంగా డ్రెడ్జింగ్ చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించడంతో పాటు వైసీపీ జిల్లాలో మచ్చుకు కూడా కనిపించకుండా పోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యారు. ఎన్నికల ముందు ఉచిత ఇసుక విధానం తెస్తానని ఆయన ప్రకటించిన సంగతి తెలిసిందే.అన్నివర్గాలు ఆనందించాయి. భవన నిర్మాణ రంగం, సొంతంగా ఇల్లు కట్టుకునేవారు, అన్ని వర్గాలు ఆనందంగా ఉన్నారు. ప్రస్తుతం జిల్లాలోని ఇసుక ర్యాంపులన్నీ ఆగిపోయాయి. దీనితో ఇసుక కొరత ఏర్పడ వచ్చు. ఈనేపథ్యంలో మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఇసుక విధానం మీద చర్చినట్టు సమాచారం.

జిల్లాలో ర్యాంపుల వివరాలు

జిల్లాలో 17 ఓపెన్ ర్యాంపులు ఉన్నాయి. సుమారు 32 వరకూ డీసిల్టేషన్ ర్యాంపులున్నాయి. అవన్నీ ప్రస్తుతం ఆగాయి. కడియం మండలంలో వేమగిరి-కడియపులంక(బుర్రిలంక), సీతానగరం మండలంలోని వంగలపూడి-1, వంగలపూడి-2, ములకలంక, కాటవరం, పెరవలి మండలంలో ముక్కామల-2, కాకరపర్రు-1, మల్లేశ్వరం, తీపర్రు-2, తీపర్రు-3, పెండ్యాల, కానూరు ర్యాంపులున్నాయి. నిడదవోలు మండలంలో పందలపర్రు, జీడిగుంట, చిడిపి ర్యాంపులు, కొవ్వూరులో కుమారదేవం-1, కుమారదేవం-2, కుమారదేవం-3, తాళ్లపూడి మండలంలో వేగేశ్వరం ర్యాంపులున్నాయి. ఇక అఖండ గోదావరి కుడి ఏటిగట్టు వాడపల్లి, ఔరంగాబాద్, ఔరంగాబాద్-2, ఎరినమ్మ, కొవ్వూరు, దొండగుంట రేవు, అరికిరేవుల-1,2, తాళ్లపూడి, ప్రక్కిలంకతో పాటు 10 డీసిల్టేషన్ ర్యాంపులు ఉన్నాయి. వీటిలో 33 బోట్స్‌మన్ సొసైటీలు ఉన్నాయి. అఖండగోదావరి ఎడమ ఏటిగట్టు వైపు మొత్తం 28 డీసిల్టేషన్ ర్యాంపులున్నాయి. గాయత్రీ-1నుంచి 8, కోటిలింగాల 1,3,4,5, కాతేరు 1నుంచి15 ర్యాంపులు, వెంకటనగరం ర్యాంపులున్నాయి.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజీమాల్ వై.స్క్రీన్1	మనమే
వై.స్క్రీన్2	మహారాజ
దేవిశ్రీ(గాయత్రి)	హరోంహర
అనన్య	తమ్ముడు
నిడదవోలు	
వీ మ్యాక్స్	కల్కి
రాధాకృష్ణ	కల్కి
శ్రీగణపతి	కల్కి
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	కల్కి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	కల్కి
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	గంగం గణేశా
స్క్రీన్ 2	---
శ్రీనివాస	---